తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY

ప్లాస్టిక్ సర్జరీ రూమర్స్‌పై స్పందించిన నయనతార..

8 లో..

## ఇదండీ..కబురు..



సంపుటి : 22 సంచిక : 322 | మంగళవారం అక్టోబర్ 29 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

# సీఎం రేవంత్ ఇంటివద్ద భద్రతా మార్పులు

### బెటాలియన్ పోలీస్ సిబ్బందిని తొలగింపు
### ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు
### సీఎం సెక్యూరిటీ వింగ్ కీలక నిర్ణయం



కబురు, హైదరాబాద్ అక్టోబర్ 28

**జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు సీఎం ఇంటివద్ద బందోబస్తు విధులు నిర్వహించిన బెటాలియన్ పోలీస్ సిబ్బందిని సీఎం సెక్యూరిటీ వింగ్ తప్పించింది. వారి స్థానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందితో భద్రత కల్పించింది. సీఎం ఇంటికి మూడు వైపులా ఉన్న 22 మంది టీజీఎస్‌పీ సిబ్బందిని మార్చి ఏఆర్ సిబ్బందిని నియమించారు. గత కొన్ని రోజులుగా బెటాలియన్ పోలీసులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ మార్పులు చేశారు.**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసులు నిరసనలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బెటాలియన్ పోలీసుల నిరసనలు, ధర్నాలతో హోరెత్తిస్తుండడంతో ఇంటెలిజెన్స్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీలో ఉన్నతాధికారులు కీలక మార్పులు చేశారు. ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ టీజీఎస్పీ పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో నిరసనలు చేస్తూ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ క్రమశిక్షణా చర్యల పేరుతో 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను శనివారం నాడు పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆదివారం నాడు ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ వీరి ఆందోళనలు మాత్రం ఆగడం లేదు. తమకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని బెటాలియన్ పోలీసులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతా సిబ్బందిని మార్చివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పుడు ఉన్న భద్రతా సిబ్బందిలో ఎక్కువ మంది గత సీఎం కేసీఆర్ వద్ద పని చేసిన వారే. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం,

మిగతాద్ది 2 లో



# ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది

### - గుజరాత్ పర్యటనలో ప్రధాని మోడీ

కబురు, వదోధర, అక్టోబర్ 28

ప్రపంచం మొత్తం నేడు భారతదేశం వైపు చూస్తోందని, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వివిధ దేశాల నేతలు మనకు స్నేహ హస్తం అందించేందుకు ఆశగా ఎదురు చూస్తున్నాయని ఆయన చెప్పుకొచ్చారు. గుజరాత్‌లోని అమ్రేలి జిల్లా లాతీ ప్రాంతంలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా రూ.4,800 కోట్లతో పెద్దఎత్తున అభివృద్ధి పనులను మోదీ ప్రారంభించారు. భారతదేశంలో ఉన్న విస్తృత అవకాశాలపై ఇప్పుడు ప్రపంచ దేశాలు చర్చిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. మనం అంతర్జాతీయ వేదికలపై మాట్లాడుతుంటే పలు దేశాలు ఎంతో ఆతృతగా వింటున్నాయని చెప్పారు. ఇటీవల రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న దేశాలు మనతో చేతులు కలిపేందుకు, భాగస్వామం అయ్యేందుకు ఉవిళ్లూరుతున్నాయని ప్రధాని చెప్పుకొచ్చారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశాలపై ప్రతీ దేశం తమను అడుగుతున్నాయని తెలిపారు

2 లో

# సామాన్యులపై ఎలాంటి విద్యుత్ భారం ఉండదు: ఈఆర్‌సీ ఛైర్మన్



కబురు, హైదరాబాద్ అక్టోబర్ 28

సామాన్యులపై ఎలాంటి విద్యుత్ భారం ఉండబోదని ఈఆర్‌సీ ఛైర్మన్ శ్రీరంగారావు తెలిపారు. 800 యూనిట్లు దాటిన వారిపై స్వల్పంగా ఛార్జీల పెంపు ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి డిస్కంలకు రావాల్సిన బకాయిలు సుమారు రూ. 25వేల కోట్లుగా ఉందని, డిస్కంలు నష్టాలు తగ్గించుకునేందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వీలైనంత త్వరగా తీసుకోవాలని సూచించారు.

# జన్వాడ ఫామ్ హౌస్ కేసులో మరో ట్విస్ట్!



కబురు, హైదరాబాద్ అక్టోబర్ 28

జన్వాడలోని ఫామ్ హౌస్‌లో రేవ్ పార్టీ వ్యవహారం తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. రేవ్ పార్టీ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. విచారణకు రాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దీంతో, స్పందించిన రాజ్ పాకాల.. విచారణకు హాజరయ్యేందుకు రెండు రోజులు సమయం కావాలని కోరారు.జన్వాడ ఫామ్ హౌస్ కేసుకు సంబంధించి రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. బీఎన్ఎస్ఎస్ 35(3) సెక్షన్ ప్రకారం మోకిల పోలీసులు నోటీసులు జారీ చేశారు. రేవ్ పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని.. నేడు విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. విచారణకు రాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

02

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికీ మేలు చేయలేదు



కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికీ మేలు చేయలేదని.. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేపోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ ధర్నాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేసీఆర్ పథకాలను కూడా సీఎం రేవంత్ కొనసాగించలేకపోతున్నారని.. బతుకమ్మ చీరలను సైతం ఇవ్వలేకపోయారని హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా తమ ప్రభుత్వ హయాంలో రైతుల కోసం రైతుబంధు ఇచ్చామన్నారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ.15వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్.. గతంలో ఉన్న రూ.10వేలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పత్తికి మద్దతు ధర రాకపోయినా సీఎం, మంత్రులు నోరుమెదపడం లేదన్నారు. అకాల వర్షాలతో ఇప్పటికే పత్తి రైతులు ఇబ్బందుల్లో ఉంటే గోరుచుట్టుపై రోకలిపోటులా వారికి మద్దతు ధర కూడా లేదని విమర్శించారు.ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మంలో రైతులు రోడ్డెక్కినా.. ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో మక్కల కొనుగోలు కేంద్రాలే ప్రారంభం కాలేదన్నారు. వడ్ల కొనుగోలుకు మంత్రులు కొబ్బరికాయలు కొట్టుడే తప్ప.. వాటిని కొనే దిక్కులేదని విమర్శించారు. వడ్లకు రూ.2,320 మద్దతు ధర రావాల్సి ఉండగా.. రూ.1800 నుంచి రూ.1900కే రైతులు అమ్ముకుంటున్న పరిస్థితి వచ్చిందన్నారు. పత్తికి రూ.7,521 మద్దతు ధర రాకపోవడంతో రూ.5,000 - రూ.5,500కే విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలంగాణలో 13 మంది ఐఏఎస్ ల బదిలీ




కబురు, హైదరాబాద్ అక్టోబర్ 28

**తెలంగాణలో మరోసారి భారీగా ఐఏఎస్ ల బదిలీలు జరిగాయి. సోమవారం (అక్టోబర్ 28) 13 మంది ఐఏఎస్ లను ప్రభుత్వం ట్రాన్స్ ఫర్ చేసింది. నల్గొండ కలెక్టర్‌గా త్రిపాఠి, రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి, యాదాద్రి కలెక్టర్‌గా హనుమంతరావు, మున్సిపల్ శాఖ డైరెక్టర్‌గా టీకే శ్రీదేవి, సీసీఎల్‌ఏ డైరెక్టర్‌గా మందా మకరందు, ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా ఎస్.హరీష్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా దిలీప్‌కుమార్, పర్యాటక శాఖ సంచాలకులుగా జెడ్.కే హనుమంతు, రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్ గా శశాంక, విపత్తు నిర్వహణ సంయుక్త కార్యదర్శిగా హరీష్ కు అదనపు బాధ్యతలు.. ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కమిషనర్ గా వినయ్ కృష్ణారెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ గా నిఖిల్ చక్రవర్తి, డెయిరీ కార్పొరేషన్ ఎండీగా కే.చంద్రశేఖర్ రెడ్డిలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు 2024, అక్టోబర్ 28న సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.**

# దొంగలు.. దొంగలు కలిసి ఊళ్లు పంచుకుంటున్నారు: కేటీఆర్



కబురు, హైదరాబాద్ అక్టోబర్ 28

ప్రస్తుతం రాష్ట్రంలో 'దొరికినకాడికి దోచుకో అందినంత దండుకో' దందా నడుస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అక్రమార్కులు, కాంగ్రెస్ గ్యాంగ్‌లు చెట్టాపట్టాలేసుకొని సహజ వనరులను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. చీకటి వాటాలు, సీక్రెట్ ఒప్పందాలు చేసుకొని యథేచ్ఛగా ఇసుక, మట్టిని బుక్కేస్తున్నారన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ప్రజా పాలనలో దొంగలు.. దొంగలు కలిసి ఊళ్లు పంచుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. ఇసుకాసుర.. బకాసుర.. భస్మాసుర రాజ్యం ఇది అని పేర్కొన్నారు. హైడ్రా దెబ్బకు హైదరాబాద్‌లో సొంతింటి కలలు కలగానే మిగిలిపోతున్నాయన్నారు. కాసులపై కక్కుర్తి నిర్ణయాలు రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్నాయని ఆరోపించారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# సువర్ణ వాకిలి

'చూశావా... ఏం తెచ్చానో' అన్నాడతను స్కూటర్ ఇంటి ముందు ఆపి. వెనుక ట్రాలీ వచ్చి ఆగింది. అన్నీ మొక్కలే. నర్సరీ నుంచి తాజాగా




దిగినవి. 'అడిగావుగా... మల్లెతీగ తెచ్చాను'... 'ఇదిగో... నీకు ఇష్టమైన బంతి. కుండీలోనే ఎన్ని పూసేసిందో చూడు'... 'చిట్టి రోజాలు... రెక్క చామంతులు... ఈ మందారం కొమ్మలేసేంతగా పెరిగితే చాలా బాగుంటుంది'... వరుసగా చూపుతున్నాడు. ఎన్నాళ్లుగానో అడుగుతోంది. ఇవాళ ఉదయాన్నే లేచి, చెప్పా పెట్టకుండా వెళ్లి తెచ్చాడు. సంతోషంగా, సంబరంగా, ప్రేమగా చూస్తోంది వాటన్నింటిని! 'నన్నూ తీసుకెళ్లుంటే బాగుండేదిగా'... 'ఇంట్లోకి మొక్కలు వస్తున్నప్పుడు నువ్వు ఎదురు రావాలనీ'... ఆమె చేతిలో చాలా పూలున్న చిన్న కుండీని పెట్టి సెల్ఫీ దిగాడు. ఇద్దరూ హాయిగా నవ్వారు ఫొటోలో. 'దీని పేరు బెగోనియా అట. బాగుంది కదూ'...మరోచోట మరో ఇంటతను రెండు రోజులుగా ఇల్లు సర్దుతున్నాడు. భార్యను పిలిచి 'అనవసరమైన సామాను చాలా పేర్చిపెట్టావు చూడు' అని బుజ్జగించి పారవేయించాడు. మాసిన కర్టెన్లు తీసి, ఉతికిన కర్టెన్లు మార్చాడు. దుమ్ము పట్టిన లైట్లను తుడిచాడు. అన్నీ చక్కగా అమర్చి హాల్లో రెండు ర్యాకులను ఖాళీగా సంపాదించగలిగాడు. 'ఇప్పుడు ఏం చేద్దామని ఈ ర్యాకులను' అందామె. 'చెప్తా' అని సాయంత్రం పిల్లల్ని తీసుకొని ఆటో ఎక్కి పుస్తకాల షాపుకు చేరాడు.'పిల్లలూ... ఒక ర్యాకుకు సరిపడా పుస్తకాలు మీరు కొనుక్కోండి. ఒక ర్యాకుకు సరిపడా మేము కొనుక్కుంటాం'.... పెళ్లికి ముందు వారిద్దరూ పుస్తకాలు చదివేవారు. సంసారంలో పడి వదిలేశారు. 'ఇష్టమైన అలవాటు. తిరిగి మొదలెడదాం' అన్నాడు భార్యతో. అప్పటికే ఆమె పుస్తకాలు ఎంచి ఒకవైపు పెట్టేస్తోందిగా! ఇంకో నగరం. ఉదయపు ఎండ ఎక్కువగా లేదు. అలాగని తక్కువగా లేదు. మంచి గాలి వీస్తున్నందు వల్ల బాల్కనీలో ఎదురూ బొదురూ సమయం ఆహ్లాదంగా ఉంది. 'నీ ఫోను ఇవ్వు' అన్నాడామెతో భర్త. తీసుకుని స్విగ్గి, జొమాటో లాంటి యాప్స్ డిలీట్ చేశాడు. తన ఫోన్ ఆమెకు ఇచ్చాడు. 'ఫుడ్ డెలివరీ యాప్స్ తీసెయ్' అన్నాడు. తీసేసింది. 'ఇవాల్టి నుంచి బయటి తిండి వద్దు. ఈ ఇంట్లోకి ఏది వచ్చినా ఇకపై హెల్దీదే వస్తుంది. నేను వారంలో మూడు బ్రేక్‌ఫాస్ట్‌లు, కనీసం రెండు డిన్నర్లు నువ్వు కిచెన్ లోకి రానవసరం లేకుండా చేయగలను. మిగిలింది నువ్వు చేయి. అసలు పొయ్యి ఎక్కవలసిన అవసరం లేని మంచి తిండి కూడా పిల్లలతో కూచుని డిజైన్ చేద్దాం. ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకు వెచ్చించే సమయం మన ఉదరం కోసం వెచ్చిస్తే తెలిసి తెలిసీ ద్రోహం చేసుకోని వాళ్లం అవుతాం. మన తాత ముత్తాతలు వండుకోవడానికి తిండిలేక ఏడ్చేవాళ్లు. మనకు అన్నీ ఉన్నా వండుకోవడానికి ఏడిస్తే ఎలా? పరుగు పెట్టి సంపాదించి పట్టెడు మెతుకులు తినలేని స్థితికి చేరితే సంతోషమా మనకు?'అబ్బో! ఆ ఇంటిలో సందడి వేరేగా ఉంది. కోడలు మాటిమాటికీ ఊరికి ఫోన్లు మాట్లాడుతూ ఉంది. టికెట్ల ఏర్పాటు చూస్తూ ఉంది. అంత వరకూ ఖాళీగా ఉన్న మూడో బెడ్‌రూమును సిద్ధం చేస్తూ ఉంది. కొడుకు ఉద్వేగంగా ఉన్నాడు. కలా నిజమా తేల్చుకోలేక ఉన్నాడు. సాకులు వెతుక్కున్నారు తనూ తన భార్య. లేనిపోని తప్పులు వెతికారు తనూ తన భార్య. మా జోలికి రావద్దని తేల్చి చెప్పారు ఇద్దరూ కలిసి. బాగానే ఉంది. హాయిగా ఉంది. కాని బాగానే ఉందా... హాయిగా ఉందా... తల్లితండ్రులు అడుగుపెట్టి నాలుగేళ్లు అవుతున్న ఈ ఇల్లు. వారి ఆశీర్వాదం తాకని ఇల్లు. వారి మాటలు వినపడని, వారి గదమాయింపులూ ఆత్మీయ హెచ్చరికలూ లేని ఇల్లు. పశ్చాత్తాపం పిల్లలకు మరో పుట్టుక ఇస్తుంది. ఈ పుట్టుక తల్లితండ్రులను కోరింది. మనవలు వెళ్లి రిసీవ్ చేసుకొని తీసుకువస్తే కొడుకూ కోడల్నీ కన్నీటి కళ్లతో చూస్తూ లోపలికి అడుగు పెట్టారు తల్లితండ్రులు. విశేషం చూడండి. ఆ రోజు 'ధన్ తేరస్'.సాధారణంగా ధన్ తేరస్‌కి ఇంటికి బంగారం వస్తే మంచిది అనంటారు. కాని పై నాలుగు ఇళ్లలో బంగారం వంటి నిర్ణయాలు జరిగాయి. సిసలైన 'ధన్ తేరస్' అదే కావచ్చు.ధనం వల్ల ధన్యత రాదు. ధన్యత నొసగే జీవితం గడపడమే నిజమైన ధనం కలిగి ఉండటం. గాలినిచ్చే మంచి చెట్టు, పుష్టినిచ్చే తాజా ఆహారం, కష్టసుఖాలు పంచుకునే నిజమైన మిత్రులు, బుద్ధీ వికాసాలు కలిగించి ఈర్ష్యా వైషమ్యం పోగొట్టే పుస్తకాలు, సదా అమ్మా నాన్నల సాంగత్యం, కుటుంబ సభ్యులంతా కలిసి భోం చేయగల సమయాలు, కనీస వ్యాయామం... ఇవి ఏ ఇంట ప్రతిరోజూ ఉంటాయో, అడుగు పెడతాయో, అంటిపెట్టుకుని ఉన్నాయన్న భరోసా కల్పిస్తాయో ఆ ఇల్లు సదా సమృద్ధితో అలరారుతుంది. అక్కడ అనివార్యంగా సంపద పోగవుతుంది. ఉత్తమమైన లోహం బంగారం. అది ఉత్తమమైన నివాసాన్నే ఎంచుకుంటుంది. శీతగాలులు ముమ్మరమయ్యే ముందు ఉల్లాస, ఉత్సాహాల కోసం దీపావళి. పనికి మనసొప్పని ఈ మందకొడి రోజులలో జీవనోపాధి దొరకకపోతే గనక జరుగుబాటుకు దాచిన ధన్‌తేరస్ పసిడి. పెద్దలు ఏం చేసినా ఆచితూచి, ఆలోచించి చేస్తారు. ధన్‌తేరస్‌కు తప్పక బంగారం, వెండి, వస్తువులు కొనదలుచుకుంటే కొనండి. కాని ప్రతి ఇల్లూ ఒక సువర్ణ వాకిలి కావాలంటే మాత్రం అహం, అసూయ, అజ్ఞానాలను చిమ్మి బయట పారబోయండి! 'వాడికేం... బంగారంలా బతికాడు' అంటారు. అలా బతికి అనిపించుకోండి! ధన త్రయోదశి శుభాకాంక్షలు. ప్రతి ఇంటా వికసిత కాంతులు కురియుగాక!

## శుభవార్త.. కొత్త హెల్త్ స్కీమ్ ప్రకటించిన నీతా అంబానీ..

# మహిళలకు, పిల్లలకు ఉచిత చికిత్స!

రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ దేశంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్త. అతని భార్య నీతా అంబానీ రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా సామాజిక కార్యక్రమాల కోసం ముఖ్యమైన పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నీతా అంబానీ ద్వారా ఒక పెద్ద సామాజిక కార్యక్రమం చేపట్టారు. పిల్లలు, యువకులు, మహిళలకు ఉచిత పరీక్షలు, చికిత్స సౌకర్యాలు అందించనున్నారు. సర్ హెచ్‌ఎన్ రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్ 10వ వార్షికోత్సవం సందర్భంగా నీతా అంబానీ లక్ష మందికి పైగా మహిళలకు ఉచిత పరీక్షలు, చికిత్సను అందిస్తామని హామీ ఇచ్చారు.

సర్ హెచ్‌ఎన్ రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కొత్త ఆరోగ్య సేవా పథకంలో భాగంగా అట్టడుగు వర్గాలకు చెందిన



పిల్లలకు ప్రత్యేక వైద్య ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో లక్ష మంది మహిళలకు అందించే ఆరోగ్య సేవలు కూడా ఉన్నాయి. ఇది కాకుండా దీని కింద ఏ సేవలు అందించనున్నారో తెలుసుకుందాం.నీతా అంబానీ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ, అధునాతన చికిత్సలతో కలిసి రిలయన్స్ ఫౌండేషన్ ఒక దశాబ్దాన్ని జరుపుకుంటామని, ఎందుకంటే భారతదేశానికి ఆరోగ్యకరమైన, ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మించడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆసుపత్రిని ప్రపంచ స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో మేము మిలియన్ల మంది జీవితాలను మెరుగుపరిచామని అన్నారు.

- **పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడుతున్న 50,000 మంది పిల్లలకు ఉచిత పరీక్షలు, చికిత్స.**
- **50,000 మంది మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్, చికిత్స.**
- **10,000 మంది యుక్తవయస్సులో ఉన్న బాలికలకు ఉచిత గర్భాశయ క్యాన్సర్ టీకా.**

# దీపావళిపై పోలీసులు ఆంక్షలు విధించారా

**సర్క్యులేట్ అవుతున్న న్యూస్‌లో నిజమెంత..?**

ఒకప్పుడు పండుగొస్తుందంటే సంబరాలు తెచ్చేది..కానీ ఇప్పుడు పండగొస్తుందంటే వివాదాలు తెస్తోంది. ఎప్పుడు జరుపుకోవాలన్నదానిపై వివాదం...ఎలా జరుపుకోవాలన్నదానిపై వివాదం...ఎలా జరపకూడదు అన్నదానిపై వివాదం...ఇలాంటి వివాదాల నడుమ...ఆంక్షలు..ఇంకేముంది సగం పండగ సంబరం వివాదాలతోపోతే...మరో సగం..ఆంక్షలతో ఆవిరైపోతోంది..ఇప్పుడు దీపావళి పండుగ సంబరం కూడా ఇలాంటి వివాదాలతో చిక్కుకుంది. ఇంతకూ దీపావళిపై పోలీసులు ఆంక్షలు విధించారా...? సర్క్యులేట్ అవుతున్న న్యూస్‌లో నిజమెంత..?

దీపావళి పండుగ అంటేనే పటాకులు పేలాల్సిందే. కాకరపుల్లలు, చిచ్చుబుడ్లు, భూచక్రాల నుంచి మొదలుపెట్టి.. థౌసెండ్ వాలాలు, లక్ష్మీబాంబులు ఇలా పేర్లు ఏవైనా.. మోత మోగిపోవాల్సిందే. ఇటు భూమి మీద పేల్చే బాంబులే కాదు.. ఆకాశానికి దూసుకెళ్లి మిరుమిట్లుగొలిపే పటాసులు కూడా పెద్ద ఎత్తున కాలుస్తుంటారు. ఎంత ఎక్కువ కాలిస్తే.. అంత ఎక్కువ పండుగను ఎంజాయ్ చేసినట్టు. పండుగ రోజే కాదు.. దీపావళి వస్తుందంటే నాలుగైదు రోజుల ముందు నుంచే పటాకులు పేలుతూనే ఉంటాయి. మళ్లీ కార్తీక పౌర్ణమి వరకు ఈ మోత మోగుతూనే ఉంటాయి%ొ ఇలాంటి సంబరంలో పోలీసులు ఆంక్షలు పెట్టారన్న పుకారు ఇప్పుడు తెలుగు జనాలను ఆందోళనలో పడేసింది. క్రాకర్స్ కాల్చటంపై హైదరాబాద్ పోలీసులు పలు ఆంక్షలు పెట్టారని.. వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. పలు నిబంధనలు పెట్టారంటూ నెట్టింట ఓ న్యూస్ వైరల్ అయింది. పండుగ రోజు



రెండు గంటలు మాత్రమే అదీ 8 నుంచి 10 గంటల వరకే క్రాకర్స్ కాల్చాలన్న నిబంధనలు పెట్టారని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించినట్లు వార్తలొచ్చాయి. సరిగ్గా ఆ సమయంలోనే హైదరాబాద్ పరిధిలో నెల రోజుల పాటు 144 సెక్షన్ విధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. దీంతో కొన్ని హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

దీనిపై పోలీసుల నుంచి క్లారిటీ వచ్చింది. రకరకాల ఆందోళనలు.. సచివాలయం, సీఎం నివాసం, డీజీపీ కార్యాలయం, రాజ్‌భవన్ మొదలైన వాటిపై ఆకస్మిక దాడులకు కొన్ని గ్రూప్లు ప్లాన్ చేశారని ఇంటిలిజెన్స్ రిపోర్ట్ వచ్చిందని.. అందుకే 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చినట్లు క్లారిటీ ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు హైదరాబాద్‌లో దీపావళి వేడుకలకు ఎలాంటి సంబంధం లేదని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.మరోవైపు హైదరాబాద్ అబిడ్స్ పరిధిలోని బొగ్గుల కుంటలో ఆదివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పారాస్ బాణాసంచా దుకాణంలో జరిగిన పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. పక్కనే ఉన్న ఓ హోటల్‌కు మంటలు వ్యాపించడంతో జనం భయంతో పరుగులు తీశారు. రాత్రి విక్రయాలు జరుగుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. భారీగా ఆస్తి నష్టం జరిగింది. పారాస్ దుకాణం పర్మిషన్ ఇచ్చిన చోటు కాకుండా మరోచోట పెట్టినట్లు అధికారులుగుర్తించారు . ఇలా నిబంధనలు అతిక్రమించే షాపులకు ఫైర్ సేఫ్టీ విభాగం నుంచి స్ట్రిక్ట్ ఆర్డర్స్ వచ్చాయి. టపాసు దుకాణాలకు పలు నిబంధనలతో కూడిన సర్క్యులర్ జారీ అయింది. ఓపెన్ ప్లేసుల్లో మాత్రమే దుకాణాలు తెరవాలని%ొ%పిల్లలను అనుమతించకూడదని తెలిపింది. ప్రతి ఫైర్ షాపు దగ్గర 200 లీటర్స్ వాటర్ డ్రమ్ములు, బకెట్స్ కచ్చితంగా ఉండాలని ఆదేశించింది.

టపాసు దుకాణాలపై ఆంక్షలు తప్ప%ొ%పండుగ జరుపుకునే విషయంలో ఎలాంటి కండీషన్స్ లేవు. అయితే దేశవ్యాప్తంగా పలుచోట్ల దీపావళిపై ఆంక్షలున్నాయి. కాలుష్యం విపరీతంగా ఉండే ఢిల్లీ లాంటి ప్రదేశంలో కోర్టు గైడ్‌లైన్స్ తప్పకుండా పాటించాలన్న నిబంధన ఉంది. ఢిల్లీలో క్రాకర్స్ కాల్చటం టోటల్‌గా నిషేధం. అక్కడ అమ్మకూడదు..కొనకూడదు. కొన్ని ప్రాంతాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధనల ప్రకారం.. 55 డెసిబెల్స్ మించి శబ్దం చేసే క్రాకర్స్ కాల్చకూడదు. అలాగే గ్రీన్ క్రాకర్స్ మాత్రమే కాల్చాలని , అమ్మాలన్న నిబంధన కూడా ఉంది. అయితే శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం లేకుండా గ్రీన్ క్రాకర్స్‌కు ప్రిఫరెన్స్ ఇస్తే మంచిదని పర్యావరణ వేత్తలు

# జన్వాడ ఫామ్ హౌస్ కేసులో మరో ట్విస్ట్!

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా రాజ్ పాకాల..అడ్రస్ ప్రూఫ్, కేసుకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని సూచించారు. అయితే, రాజ్ పాకాల.. పోలీసులకు అందుబాటులోకి రాకపోవడంతో మోకిల ఇన్‌స్పెక్టర్ పేరుతో ఉన్న నోటీసులను రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్‌లో ఆయన నివాసానికి అతికించారు. ఇక, పోలీసుల నోటీసుల నేపథ్యంలో హైకోర్టును రాజ్ పాకాల ఆశ్రయించారు. అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు అక్రమంగా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో ఆయన కోరారు. మరోవైపు.. పోలీస్ విచారణకు హాజరు అవ్వడానికి రెండు రోజులు గడువు కావాలని న్యాయవాది ద్వారా మోకిల పోలీసులకు ఆయన లేఖ పంపారు.

## ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది

మొదటిపేజీ తరువాయి

. ప్రపంచ వేదికలపై భారత్ హవా నడుస్తోందని ప్రధాని మోదీ చెప్పారు. ఇటీవల భారత్ పర్యటనకు వచ్చిన జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ తమ దేశం ప్రతి సంవత్సరం 90వేల మంది భారతీయులకు వీసాలు మంజూరు చేస్తుందని ఢిల్లీ వేదికగా ప్రకటించారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఈ మేరకు అవకాశాలు పొందేందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన బాధ్యత దేశ యువతపై ఉందని ఆయన అన్నారు. మనం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రపంచ వేదికలపై భారతదేశం ప్రభావం పెరుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రపంచం మొత్తం భారతదేశాన్ని కొత్త కోణంలో చూస్తోందని అన్నారు. విదేశీలు ఇండియా సామర్థ్యాన్ని గుర్తించడం ప్రారంభించారని ప్రధాని చెప్పుకొచ్చారు. నేడు ప్రపంచం మొత్తం మనం చెప్పిన ప్రతి విషయాన్ని శ్రద్ధగా వింటోందని మోదీ అన్నారు. మ్రేలి జిల్లాలో 2007లో డెయిరీ కోఆపరేటివ్‌ను ప్రారంభించినప్పుడు దానికి అనుబంధంగా కేవలం 25 గ్రామాలు మాత్రమే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. నేడు ఆ సంఖ్య 700లకు చేరుకుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో అమ్రేలి జిల్లాలోని ఓడరేవులు బాగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పుకొచ్చారు. గుజరాత్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు.

# సిఎం రేవంత్ ఇంటివద్ద భద్రతా మార్పులు

మొదటిపేజీ తరువాయి

ఆయనకు సంబంధించిన వ్యక్తిగత, అధికారిక సమాచారం బయటకు వెళ్తోందని మార్పులు చేశారు. పాత వారిని తొలగిస్తూ కొత్త భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయితే సమాచారం బయటకు వెళ్లడంపై సీఎంవో, ఇంటెలిజెన్స్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అప్పుడు భారీగా మార్పులు చేశారు. అలాగే ప్రస్తుతం టీజీఎస్పీ పోలీసుల నిరసనల నేపథ్యంలో ఉన్నతాధికారులు ముందుగానే అప్రమత్తం అయ్యారు.

# సామాన్యులపై ఎలాంటి విద్యుత్ భారం ఉండదు: ఈఆర్‌సీ చైర్మన్

మొదటిపేజీ తరువాయి

ఎరియర్స్ తొందరగా ఇస్తే.. డిస్కంలు తొందరగా నష్టాల నుంచి బయటపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. డిస్కం వార్షిక టారిఫ్ ప్రతిపాదనలపై ఈఆర్‌సీ సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది.విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులు, వినియోగదారులు, ప్రభుత్వ రాయితీలను దృష్టిలో పెట్టుకొని కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు ఏ కేటగిరిలోనూ పెంచడం లేదన్నారు. స్థిర ఛార్జీలు రూ.10.. యాథాతథంగా ఉంటుందన్నారు. నీటిపారుదలకు సంబంధించి టైమ్ ఆఫ్ డే పీక్ అవర్‌లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల మధ్య.. నాన్ పీక్ అవర్‌లో రాయితీని రూపాయి నుంచి రూపాయిన్నరకు పెంచినట్లు చెప్పారు. గృహ వినియోగదారులకు మినిమం ఛార్జీలు తొలగించామన్నారు. గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలను కమిషన్ ఆమోదించిందని ఛైర్మన్ రంగారావు తెలిపారు. అయితే, ఇవి కేవలం ఐదు నెలల వరకే ఉంటాయన్నారు.పౌల్ట్రీ, గోట్ ఫాంలను కమిషన్ ఆమోదించలేదని చెప్పారు. చేనేత కార్మికులకు హార్స్ పవర్ పెంచామని.. హెచ్‌పీ 10 నుంచి 25కి పెంచామన్నారు.

## పండరీపూర్ భక్తుల పాదయాత్రను ప్రారంభించిన కౌన్సిలర్ కాసుల రోహిత్





**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 28**
నసూరుల్లాబాద్ మండలంలోని సోమలింగేశ్వర ఆలయం నుండి పండరీపూర్ వెళ్లే భక్తుల పాదయాత్రను సోమవారం కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ కాసుల రోహిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పండరీపూర్ భక్తుల పాదయాత్ర భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ఆధ్యాత్మికతంగా చేసే పాదయాత్ర మానసికంగా శారీరకంగా ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్వాములు కౌన్సిలర్ కాసుల రోహిత్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాములు మహారాజ్, నాందేవ్ మహా రాజ్, శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, పర్వ రెడ్డి, శనిగరం కిషన్, సాయిలు,మన్నే సాయిలు, భరత్, పాదయాత్ర భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న7800 కోట్ల స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ లను వెంటనే విడుదల చేయాలి...







– ఏబీవీపీ నాయకులు..

– మహా ధర్నా తో ట్రాఫిక్ జామ్...

**కబురు న్యూస్, బోధన్ అక్టోబర్ 28..**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం బోధన్ నగరంలో విద్యార్థులు ర్యాలీతో వెళ్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 7800 వేల కోట్లు స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ లను వెంటనే విడుదల చేయాలని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితాలకు కాకుండా విద్యార్థుల పక్షాన ఉండి ఫీజు రివర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి



చెప్తామని హెచ్చరించారు. ఏరి కోరి తెచ్చుకున్న తెలంగాణలో రాజకీయ నాయకుల స్వార్థాల కోసం విద్యార్థి జీవితాలతో చెలగాటాలు ఆడితే ఊరుకునేది లేదని, రాష్ట్రం సాధించుకుంది విద్యార్థుల జీవితాలు బాగుపడతాయని ఉద్యోగాలు వస్తాయని కానీ రాష్ట్రాలు ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ విద్యార్థుల జీవితాలు మారడం లేదు ఎందుకని ప్రశ్నించారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాటం చెప్తామని తెలిపారు. ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ మీరు ఇచ్చే భిక్ష కాదని అది మా హక్కు అని అవి విడుదల చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 7800కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని, ఇకనుండి స్కాలర్షిప్లను 3వేలకు పెంచి నెలవారీగా ఇవ్వాలని కోరారు. ఎంఈఓ, డిఈఓ లతో పాటు మెగా డీఎస్సీ రిక్రూట్మెంట్ నిర్వహించి ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు. అటెండర్, స్కావెంజర్లను నియమించాలన్నారు.
వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి ఫీజుల దోపిడీని అరికట్టాలి. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. గురుకుల,రెసిడెన్షియల్ పాఠశాలలు,కళాశాలలకు పక్క భవనాలు నిర్మించి,నాణ్యమైన, భోజనం మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి నూనెలా కూనల్, ప్రవీణ్, స%శీ%జయ్, ఓంకార్, వెంకటేష్, వెంకటరెడ్డి, రవితేజ, మనోజ్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ సొసైటీ చైర్మన్ కుటుంబాన్ని పరామర్శించిన కార్పొరేషన్ చైర్మన్



**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్,28**
వర్ని మండలంలోని హుమ్నాపూర్ గ్రామానికి చెందిన మాజీ సొసైటీ చైర్మన్ శ్యాంసుందర్ అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ వారి కుటుంబాన్ని పరామర్శించి ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆయన అంత్యక్రియలో పాల్గొన్నారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మహాసభలను జయప్రదం చేసేందుకు కృతజ్ఞతలు...



**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్ 28..**
బోధన్ మండలంలోని పంటఖుర్దు గ్రామంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గైని రాములు అధ్యక్షతన పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ అక్టోబర్ 25,26తేదీలలో హైదరాబాద్ నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మహాసభలకు నిజామాబాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున వికలాంగులు తరలి వెళ్లడం జరిగిందని తెలిపారు. మహాసభలను జయప్రదం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహాసభలలో 75 మందితో కొత్త రాష్ట్ర కమిటీ ని ఎన్నుకోవడం జరిగిందని, ఆఫీస్ బేరర్లుగా 23 మందిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర కమిటీకి నిజామాబాద్ జిల్లా నుండి గైని రాములు, కవిత రెడ్డి తో పాటు ఆఫీస్ బేరర్స్ లో నన్ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిందని యేశాల గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీకి నిజామాబాద్ జిల్లా కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఉన్న వికలాంగుల కోసం నిజామాబాద్ జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ నజీర్, జిల్లా కార్యదర్శి గంగారం పటేల్, మైలారం భీమ్ రావు, ముతేవార్ సాయినాథ్, సత్తోల జైరామ్, సోనీ, కురుమ రాధాబాయి, లక్ష్మి, ఈశ్వర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇప్పించాలి...

– మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు..



**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్ 28..**
బోధన్ నియోజకవర్గం సాలూర మండలంలోని మందర్న గ్రామంలో గత 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమికి పట్టాలు ఇవ్వాలని సాగు చేసుకుంటున్న రైతులతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కు వినతిపత్రం అందజేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం మందర్న గ్రామస్తులతో కలిసి పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహాతో ను మర్యాదపూర్వకంగా కలిశారు. గుంట భూమి లేని నిరుపేదలు ముప్పై ఏళ్లుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలు ఇప్పించి ఆదుకోవాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నియోజకవర్గం ఇన్చార్జి నాగురావు, బీసీ సంఘం నాయకులు సుధాకర్ పటేల్, అంబేద్కర్ సంఘం నాయకులు మిలింద్, భీమ్రావు, కురుమ సంఘం నాయకులు శెట్టిగుండ గోనెవర్ చందు, అఖిల్, అబ్బయ్య, డ్వాక్రా సభ్యులు, గ్రామ పెద్దలు రమేష్, ప్రభు తదితరులు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన పోచారం, కాసుల





**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 28**
బాన్సువాడ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను సోమవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి కింద పేదలకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్త ఖర్చుల కోసం ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, వైస్ చైర్మన్ కొత్తిమీర్ కార్ లక్ష్మణ్, డిసిసి డేలిగేట్ కొట్టం మనోహర్, ఈశ్వర్, మాజీ జడ్పిటిసి పుప్పల శంకర్, కౌన్సిలర్లు మోతిలాల్, హకీమ్, నర్సు గౌండ,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారునికి చెక్కును అందజేసిన పోచారం, కాసుల



**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 28**
బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన కృష్ణమూర్తి గుప్తాకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్యమంత్రి సహాయ నిధిని కింద మంజూరైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్,హకీమ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు పండ్లు అందజేత



**కబురు న్యూస్ పీట్లం అక్టోబర్ 28**
బాన్సువాడ పట్టణ కేంద్రం నుండి శబరిమలకు వెళుతున్న పాదయాత్ర స్వాములకు సోమవారం పిట్లం మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికి పండ్లు, బిస్కెట్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, దీక్షా స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన...

**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్28..**






టపాసుల దుకాణాల వద్ద అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. దీపావళి పర్వదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బోధన్ పట్టణ ఎస్.హెచ్.ఓ వెంకటనారాయణ తో కలిసి అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్ సోమవారం సాయంత్రం టపాసుల దుకాణాలను పరిశీలించి, దుకాణ యజమానులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవించిన సందర్భాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు ఎలా నివారించాలో పరికరాలతో ప్రత్యక్షంగా చూపించారు. అగ్ని ప్రమాదం సంభవించకుండా తగు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పట్టణ పోలీసులు ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా చేప పిల్లల పంపిణీ చేస్తుంది

- మాజీమంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే పై మండిపాటు..
- జిల్లా ఫిషెర్మాన్ అధ్యక్షులు శ్రీనివాస్..



**కబురు న్యూస్,నిజామాబాద్,అక్టోబర్ 28 :** కాంగ్రెస్ ప్రభుత్వం గంగపుత్రుల సంక్షేమం కోసం వారికి ఆర్థికంగా చేయూతని అందించడానికి చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహిస్తుందని జిల్లా ఫిషర్ మన్ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ పేర్కొన్నారు.కాంగ్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వం పై గంగపుత్రుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడానికి ఆయన ఖండించారు.గత ప్రభుత్వంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో కోట్ల రూపాయలు గత ఎమ్మెల్యేలు తమ జేబుల్లోకి మలుచుకున్నారని ఆరోపించారు.ఆర్సపల్లి లో వున్న గంగాపుత్రుల భూమి అన్యక్రాంతానికి గురికవడానికి కారణం బిఆర్ఎస్ ఎంఎల్ఏ లు అని దానిని జిల్లా గంగపుత్రులు గ్రహించి హైకోర్టు నుండి స్టే తీసుకురావడం జరిగిందని బోధన్ ఎంఎల్ఏ సుదర్శన్ రెడ్డిఆదేశాల మేరకు కలెక్టర్ ని కలిస్తే వారు సర్వే చేయించడం వల్ల 4 ఎకరాల 24 గంటల భూమి మస్త్య కరులకు చెందుతుందని కలెక్టర్ గారు సూచనలు ఇచ్చారు.అధికారం లేకపోవడం వల్ల మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న ప్రశాంత్ రెడ్డికి తగ్గిన బుద్ధి చెప్పే రోజు వస్తుంది అని ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేకుంటే దిష్టి బొమ్మ దహనం చేస్తామని హెచ్చరించారు.గంగాపూత్రులకు ఇతర కులస్తులకు చిచ్చు పెట్టింది బిఆర్ఎస్ పార్టీ అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రమోటర్ శ్రీనివాస్,అన్నయ్య శ్రీనివాస్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## జీయో బిపి పెట్రోల్ బంక్ స్కీంలో మొదటి కొనుగోలుదారునికి ఘన సన్మానం...



**కబురు న్యూస్, బోధన్ అక్టోబర్ 28..** బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి లో గల జియో పెట్రోల్ బంక్ లో మొదటి కొనుగోలు దారుడు ఇందూర్ మోడల్ స్కూల్ వ్యవస్థాపకులు కొడాలి కిషోర్ కు ఘనంగా సన్మానించారు. బోధన్ పట్టణ శివారులోని సెలబ్రేట్ మోర్ విత్ జియో బిపి అనే నినాదంతో సోమవారం భారతదేశంలోని అన్ని జియో బిపి పెట్రోల్ బంకు లు ఈ కొత్త స్కీంను ప్రవేశ పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా బోధన్ లోని జియో బిపి పెట్రోల్ బంక్ వారు మొదటి కొనుగోలు దారుడైనా కొడాలి కిషోర్ కు పూల మాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. జియో బైపీ బంక్ స్కీమ్ బంక్ యజమానికి, పెట్రోల్ స్టాఫ్ వర్కర్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ యజమాని కటకం రమేష్ మాట్లాడుతూ సోమవారం నుండి ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు పెట్రోల్ పై లీటరుకు మూడు రూపాయల తగ్గింపు వర్తిస్తుందని తెలిపారు. అట్లాగే ప్రతిరోజు విలువైన బహుమతులు డ్రా రూపంలో అందించడం జరుగుతుందన్నారు. ఈ స్కీం 9 నవంబర్ 2024 వరకు ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ స్కీమ్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నేడు నిజామాబాద్ లో బీసీ కమిషన్ బృందం ప్రజాభిప్రాయ సేకరణ



- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి..

**కబురు న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 28 :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం ఈ నెల 29న (మంగళవారం) నిజామాబాద్ కు విచ్చేస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని తెలంగాణ బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు, మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు తమ అభిప్రాయాలను కమిషన్ కు తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు. నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ తో పాటు ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని,వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం,మెటీరియల్,సాక్ష్యాలను,సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ,సమర్పణలు,అభ్యర్థనలు,సలహాలు,ఆక్షేపణ లను కమిషన్ కు నివేదించవచ్చని తెలిపారు.ప్రజాభిప్రాయ సేకరణ కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు.

## తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన తపస్ నాయకులు



**కబురు న్యూస్ నిజాంసాగర్ అక్టోబర్ 28** ఉపాధ్యాయులకు పెండింగ్ డిఏ పిఆర్సి బిల్లులను తక్షణ పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మహమ్మద్ నగర్ మండల తహసిల్దార్ కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భునేకర్ సంతోష్, మండల బాధ్యులు కిష్టయ్య, సాయిలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల జాప్యంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తా





- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..



**కబురు న్యూస్,నిజామాబాద్ అక్టోబర్ 28 :** నగరంలోని సుభాష్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స చేసుకున్న బాధితులకు సీఎం సహాయ నిది ద్వారా 145మందికి 41,75,500 రూపాయల విలువ గల చెక్కులు అందించడం జరిగిందన్నారు.ఇప్పటివరకు ఎక్కువ మొత్తం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అర్బన్ నియోజకవర్గనికి రావడం జరిగిందని అన్నారు.కానీ ఇంకా చెక్కుల జారీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందని అన్నారు.రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల జాప్యం మరియు అప్లై చేసుకున్న మొత్తంలో 50 శాతం ప్రభుత్వం చెల్లించేలే డిమాండ్ చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు,మండల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అప్పు తీర్చమన్నందుకు వ్యక్తిపై కత్తితో దాడి






**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,అక్టోబర్ 28 :** అప్పు తీర్చమన్నందుకు ఓ వ్యక్తిపై,అప్పు తీసుకున్న వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది.మూడవ టౌన్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం దుబ్బ ప్రాంతానికి చెందిన విశ్వనాథ్,అదే ప్రాంతానికి చెందిన భాస్కర్కు మూడు నెలలు క్రితం ఐదు వేల రూపాయల అప్పు ఇచ్చాడు.అయితే అప్పు తీర్చమని విశ్వనాథ్ భాస్కర్ ను అడగగా,కక్ష పెంచుకున్న భాస్కర్ త్రీ టౌన్ పరిధిలోని శివాజీ చౌక్ వద్ద కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో విశ్వనాథ్ పై దాడి చేశాడు.రక్తపు మడుగులో ఉన్న విశ్వనాథను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మూడవ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అనంతరం నిందితుడు భాస్కర్ పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

# ప్రజావాణికి 65 ఫిర్యాదులు





**కబురు న్యూస్,నిజామాబాద్,అక్టోబర్ 28 :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,డీఆర్డీఓ సాయాగౌడ్,ఇంచార్జ్ డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డీసీసీబీ వైస్ చైర్మన్ గా చంద్రశేఖర్ రెడ్డి

కబురు న్యూస్,నిజామాబాద్ అక్టోబర్ 28 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) వైస్ చైర్మన్ గా నిజామాబాద్ మండలం బోర్గాం(పీ) గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో అప్పటి డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తన పదవి నుంచి పక్కకు వెళ్లగా,బీఆర్ ఎస్ లో కొనసాగిన అప్పటి వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి కాంగ్రెస్ లో చేరి చైర్మన్ పదవిలో ఆసీనులయ్యారు.వైస్ చైర్మన్ ఎన్నికను సోమవారం నిర్వహించగా బోర్గాం(పీ) సొసైటీ చైర్మన్ చందరశేఖర్ రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## దళిత బంధు బాధితులకు ఫోన్లో భరోసా కల్పించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి..





కబురు న్యూస్,ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 28.

దళిత బంధు రాని కుటుంబాల కోసం, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పోరాటం చేస్తానని దళితులకు హామీ ఇచ్చారని,దళితులు పాడి కౌశిక్ రెడ్డి కలవడానికి సోమవారం వారి ఇంటికి రాగా, సమయానికి ఎమ్మెల్యే అక్కడ లేకపోవడంతో నిరసన తెలిపారు.ఈ సమాచారం తెలుసుకున్న మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి అక్కడికి చేరుకొని మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దళిత బంధు, లబ్ధిదారుల కోసం అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంతమంది పనిగట్టుకుని రెచ్చగొట్టడం జరుగుతుందని దళిత బందు బాధితులు అర్థం చేసుకోవాలని కోరారు.ఎమ్మెల్యే దళిత బంధు, బాధితుల కోసం వారితో ఫోన్ మాట్లాడారు.పైలెట్ ప్రాజెక్టు కెసిఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి అందజేశారన్నారు.కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే దళిత బంధు రెండో విడత నిధులు రావట్లేదని తెలిపారు. నియోజకవర్గంలో దళిత బందు, బాధితులు అందరి కోసం పోరాటం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఎవరు ఆధర్య పడద్దని భరోసా కల్పించారు.దళితులు వెంటనే స్పందించి భరోసా కల్పించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

### - భవిత వృద్ధాశ్రయములో చీరలు నైటీలు పంపిణీ






కబురు న్యూస్,, వేములవాడ అక్టోబర్ 28

మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యుల బృందం అన్నదానం సేవాకార్యక్రమాలే కాకుండా వృద్ధాశ్రమంలో వృద్ధులకు మన వంతు ఏదైనా సహకారం అందించాలి అన్న ఉద్దేశ్యంతో కరీంనగర్ భవిత వృద్ధాశ్రమం సందర్శించి వృద్ధులతో మాట్లాడి మీకు అందరికీ చీరలు అందిస్తాం అని అనగానే అక్కడి వృద్ధులు మాకు చీరలు కట్టుకోవడం ఇబ్బంది అవుతుంది వీలైతే నైటీలు అందించండి అని కోరడంతో ట్రస్టు సభ్యులు వైజాక్ వాస్తవ్యులు కోడిమ్యాల వెంకటరాములు లత దంపతులను సంప్రదించగా వారు వెంటనే స్పందించి అందించిన సాయంతో కరీంనగర్ భవిత వృద్ధాశ్రమంలో 48 మంది వృద్ధులు ఉండగా 8 మందికి చీరలు, 40మంది వృద్ధ మహిళలకు నైటీలు అందించడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు.

## సీఎంఆర్ఎఫ్ నిరు పేదలకు వరం ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి



కబురు న్యూస్, దినపత్రిక మెదక్ నర్సాపూర్.

నర్సాపూర్ మండలం కాగజి మద్దూరు గ్రామానికి చెందిన ఎస్.శెంకర్ అనారోగ్యరిత్యా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వారికి 55,000/బియాభై అయిదురూపాయల చెక్కు మంజూరైంది ఈ సందర్భంగా మంజూరైన చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి లబ్దిదారులను కుటుంబ సభ్యులకు నర్సాపూర్ పట్టణ క్యాంపు కార్యాలయంలో అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రాగౌడ్ మన్సూర్, యాధా గౌడ్ , బాబ్యా నాయక్ ,సత్యం గౌడ్, నర్సాపూర్ మండల బా రాసా పార్టీ అధ్యక్షులు భోగ శేఖర్ , షేక్ హుస్సేన్,సూరారం నర్సింలు,నర్సింగ్ రావు, శివ కుమార్,తాజా మాజీ సర్పంచ్ లు ఉమ్లు నాయక్ , సురేష్ గౌడ్,సేనాదిపతి రవి కుమార్, జితేందర్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి,జగుపతి , రాకేష్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# లంబోదర కల్చరల్ అకాడమీ శ్రీ భవాని కూచిపూడి నర్తనశాల సమిష్టిగా నిర్వహించిన నాట్య ప్రదర్శన

- భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు కైవసం చేసుకున్నచిన్నారి నాట్య మయూరీలు
- ముఖ్యఅతిథి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు
- కార్యక్రమ నిర్వాహకులు నాట్య విజ్ఞాన్ డా. కళాఅశోక్ నక్క, నాట్య మయూరి కే. భవాని వీరిఇరువురిని అభినందించిన మెదక్ ఎంపీ
- విశిష్ట అతిథులు: దైవజ్ఞ శర్మ ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు
- అతిథులుగా: గోదావరి అంజిరెడ్డి భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు
- కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మహిళ సంగారెడ్డి జిల్లా జిల్లా అధ్యక్షురాలు
- ఎడ్ల రమేష్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు
- మోహన్ రావు భారత్ బుక్ ఆఫ్ రికార్డ్ నేషనల్ కోఆర్డినేటర్
- దళిత రత్న డా. ఏర్పుల శ్రీనివాస్ రాష్ట్రఉపాధ్యక్షులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు
- గుడి చైర్మన్, గుడి ఈవో



కబురు న్యూస్, దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా బీరంగూడెం మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో లంబోదర కల్చరల్ అకాడమీ శ్రీ భవాని కూచిపూడి నర్తనశాల సమిష్టిగా ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం 2024 సంవత్సరం పురస్కరించుకొని భారత సాంప్రదాయ నాట్యాన్ని చిన్నారుల చేత ప్రదర్శన నిర్వహించి ప్రతిభ సాధించినటువంటి చిన్నారులకు భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును ముఖ్య అతిథులు మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు, ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ , సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు కాటసుధా శ్రీనివాస్ గౌడ్, భారత్ బుక్ ఆఫ్ రికార్డ్ జాతీయ కోఆర్డినేటర్ మోహన్ రావు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, దళితరత్న డా. ఏర్పుల శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా నాట్య ప్రదర్శన చేసిన చిన్నారులకు భారత్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డును ప్రధానం చేసి ఘనంగా సన్మానించడం జరిగింది.

చిన్నారులకు నాట్యంలో ప్రతిభను సాధించుటకు మెలకువలు నేర్పి సమాజానికి పరిచయం చేసిన నాట్య గురువులను కూడా వేదిక పైన ఘనంగా సన్మానించడం జరిగింది,

ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మెదక్ పార్లమెంట్ సభ్యులు ప్రముఖ న్యాయవాది మాధవినేని రఘునందన్ రావు మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను చిన్ననాటి నుండే చిన్నారులకు నేర్పుతూ చిన్నారుల యొక్క ప్రతిభను సమాజంలో గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకోచే విధంగా సంపూర్ణ సహకార అందిస్తున్నందుకు గాను వారు కన్న తల్లిదండ్రులకు, తమ తమ గురువులకు ఈ సందర్భంగా ఈ వేదిక ద్వారా అభినందిస్తున్నాను అన్నారు, ఈ చిన్నారులే నాట్య మయూరి లుగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని మరెన్నో వరల్డ్ రికార్డులలో స్థానము సంపాదించాలని భారతదేశ కీర్తిని సాధించాలని చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, భారత్ బుక్ ఆఫ్ రికార్డు అధినేత మోహన్ రావు,అతిథులుగా విచ్చేసినటువంటి: భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, దళిత రత్న డా. ఏర్పుల శ్రీనివాస్ అంతర్జాతీయ డా.బి.ఆర్ అంబేద్కర్ సేవా పురస్కార్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు,

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ప్రముఖ సామాజిక సంఘ సేవాకులు ఎడ్ల రమేష్, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సమిష్టిగా మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా 180 మంది చిన్నారులు నాట్య ప్రదర్శన చేసి భారత్ బుక్ ఆఫ్ రికార్డ్ లో స్థానం సాధించడం ఈ జిల్లా వాసులుగా మేము గర్వపడుతున్నాం అన్నారు, మొట్టమొదటిసారిగా ఇంత పెద్ద ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర నలుమూలల పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా లంబోదర కల్చరల్ అకాడమీ, భవాని కూచిపూడి నర్తనశాల ద్వారా నాట్య విజ్ఞాన్ డా. కళ అశోక్ నక్క సంస్థ నిర్వాహకులు, నాట్యం మయూరి కే. భవాని మీ ఇరువురిని ప్రతిష్టాత్మకంగా ఘనంగా సన్మానించి అభినందిస్తూ ప్రశంసలు కురిపించడం జరిగింది.

అవార్డు అందుకున్న చిన్నారులు నాట్య గురువులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కార్యక్రమానికి విచ్చేసినటువంటి ప్రముఖులకు సంతోషంతో నమస్సుమాంజలు తెలపడం జరిగింది,

ఈ కార్యక్రమంలో అతిథులుగా: దళిత రత్న కాసాల అంబదాస్ రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు, ఆనంద్ రెడ్డి ప్రముఖ సామాజిక సంఘ సేవకులు భారతీయ జనతా పార్టీ నాయకులు, శ్రీ మల్లికార్జున స్వామి గుడి చైర్మన్, గుడి ఈవో, స్థానిక కౌన్సిలర్స్, ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయడం జరిగింది.లంబోదర కల్చరల్ అకాడమీ అధినేత నాట్య విజ్ఞాన్ డాక్టర్ కళా అశోక్ నక్క, శ్రీ భవాని కూచిపూడి నర్తన శాల అదియేత్రి కే. భవాని ఇరువురు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పిలవగానే విచ్చేసినటువంటి ప్రముఖులకు మా పిల్లలు ప్రదర్శిస్తున్నటువంటి నాట్యాన్ని సమాజానికి పరిచయం చేయడం కోసం విచ్చేసినటువంటి టీవీ చానల్స్ ప్రతినిధులకు, యూట్యూబ్ ఛానల్స్ ప్రతినిధులకు, తెలుగు దినపత్రిక పాత్రికేయులకు నాట్య గురువులకు ఇక్కడ విచ్చేసినటువంటి చిన్నారి తల్లిదండ్రులకు పేరుపేరునా అభినందన తెలుపుతూ కార్యక్రమాన్ని

# టీ కన్సల్ట్‌తో స్ప్రైపుల్ జాయింట్ వెంచర్ అగ్రిమెంట్...

- టీహబ్‌లో అంకురార్పణ.. హెచ్ఆర్ సేవల్లో ప్రత్యేకత కలిగిన స్ప్రైపుల్...
- అంతర్జాతీయ అవకాశాలు కల్పించేందుకు టీ కన్సల్ట్ ఒకే...
- అమెరికా సహా వివిధ దేశాల్లో సహకారం అందించనున్న సందీప్ మఖ్తల సారథ్యంలోని బృందం...
- టీ కన్సల్ట్‌కు ధన్యవాదాలు తెలిపిన సంస్థ సీఈఓ వెంకట్ బూర..



కబురు న్యూస్, శంకరపట్నం అక్టోబర్ 28

తెలుగు వారి టెక్నాలజీ సత్తాను అంతర్జాతీయ స్థాయికి చేర్చేందుకు టీ కన్సల్ట్‌కు అంకురార్పణ చేసిన సంస్థ చైర్మన్ సందీప్ మఖ్తల మరో ప్రముఖ సంస్థకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆవిష్కరణల కేంద్రం టీ హబ్‌లో రూపుదిద్దుకొని, హెచ్ఆర్ సేవల రంగంలో అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న డేవర్క్స్ సంస్థతో టీకన్సల్ట్ జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ కు ఓకే చెప్పేశారు. ఈ మేరకు టీ హబ్ వేదికగా సోమవారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ఒప్పందం కుదిరింది.ప్రపంచంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ కేంద్రంగా గుర్తింపు పొందిన టీ హబ్ కేంద్రంగా ఉన్న డేవర్క్స్ సొల్యూషన్స్ ద్వారా ద్వారా మానవ వనరుల నిర్వహణ హెచ్ఆర్ సొల్యూషన్స్ కు సంబంధించి స్ప్రైపుల్ సాఫ్ట్‌వేర్ ను రూపొందించారు. కృత్రిమ మేథ ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ విధానంలో హాజరను ఆటోమేటిక్‌గా ట్రాకింగ్ చేయడం. వేతనాల చెల్లింపును సమన్వయం చేయడంలో ఈ సాఫ్ట్‌వేర్ ఎంతో విభిన్నతతో పని చేస్తుంది. మానవ వనరుల డేటాను ఇటు ఉద్యోగి అటు సంస్థ పరంగా సరైన రీతిలో సమన్వయం చేసేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ ద్వారా సేవలు అందిస్తుంది. సాస్ ప్లాట్‌ఫాం కేంద్రంగా పనిచేసే ఆ సాఫ్ట్‌వేర్ అన్ని రంగాల యొక్క మావన వనరుల నిర్వహణ సవాళ్లను అధిగమించేలా రూపొందించబడింది. ప్రత్యేకమైన బృందం ద్వారా నిరంతరం సేవలు అందిస్తూ తన ప్రత్యేకతను కలిగి ఉంది.ఇంతటి ప్రత్యేకతను కలిగిన స్ప్రైపుల్ సాఫ్ట్‌వేర్ తన సేవలు అందించేందుకు సరైన అవకాశాల కోసం ఎదురు చూస్తోంది. ఈ నేపథ్యంలో టీ కన్సల్ట్ తెలుగు టెక్నాలజీ ఆవిష్కరణలకు అందిస్తున్న మద్దతు, ప్రోత్సాహం గుర్తించి టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ మఖ్తలను స్ప్రైపుల్ సంస్థ ప్రతినిధులు సహకరించి తమ ఆలోచనలు పంచుకున్నారు. తెలుగు ఆవిష్కరణలకు, టెలుగు టెక్కీలకు అండగా ఉండేందుకు, అంతర్జాతీయ స్థాయిలో వారికి అవకాశాల కల్పన చేసేందుకు టీ కన్సల్ట్‌ను ప్రారంభించిన విధానాన్ని పేర్కొన్న సందీప్ మఖ్తల స్ప్రైపుల్ కు అవకాశాల కల్పనకు అంగీకరించారు. స్ప్రైపుల్ సాఫ్ట్‌వేర్ కు ప్రోత్సహించేందుకు టీ కన్సల్ట్ జాయింట్ వెంచర్ అగ్రిమెంట్‌కు ఆయన అంగీకరించారు.టీ హబ్ లో జరిగిన కార్యక్రమంలో టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ మఖ్తల, డేవర్క్స్ సొల్యూషన్స్ సీఈఓ వెంకట్ బూర, మార్కెటింగ్ హెడ్ షేక్ జిలానీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌతమ్ ఇటికిలపాటి, టీ కన్సల్ట్ తరపున ఈశ్వర్ కోట, రాజీవ్ రావులపాటి, వంశీ, నరేంద్ర తదితరుల సమక్షంలో నేడు ఈ జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ కుదిరింది. దీనిని అనుసరించి స్ప్రైపుల్ సాఫ్ట్‌వేర్‌ను అంతర్జాతీయ అవకాశాలు సొంతం చేసుకునేందుకు టీ కన్సల్ట్ ప్రోత్సహిస్తుంది. సందీప్ మఖ్తల సారథ్యంలోని బృందం అమెరికా సహా వివిధ దేశాల్లోని టీ కన్సల్ట్ భాగస్వామ్య కంపెనీలకు స్ప్రైపుల్ సాఫ్ట్‌వేర్ ను పరిచయం చేసి దాని పురోగామికి సహకరించనుంది.ఈ సందర్భంగా సందీప్ మఖ్తల మాట్లాడుతూ. చిన్న, మధ్యతరహా సంస్థలు ప్రస్తుతం మానవ వనరుల నిర్వహణ విషయంలో పెద్ద సవాళ్లనే ఎదుర్కుంటున్నాయి. దీంతోపాటుగా పెద్ద సంస్థలకు సైతం సేవలు అందించే విధంగా స్ప్రైపుల్ సాఫ్ట్‌వేర్ రూపొందించారు. అందుకే వీరితో కలిసి ముందుకు సాగేందుకు సిద్ధమయ్యాం అని వెల్లడించారు.డేవర్క్స్ సొల్యూషన్స్ సీఈఓ వెంకట్ బూర మాట్లాడుతూ. టీ కన్సల్ట్ తో ఒప్పందం కుదుర్చుకోవడం తమకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. అధునాతన మానవ వనరుల సేవలు అందించే క్రమంలో ఈ ఒప్పందం దోహదపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జీడి రవితేజకు సన్మానం



కబురు న్యూస్, హుజురాబాద్ అక్టోబర్ 28

హుజురాబాద్ కోర్టులో అడ్వకేట్ గా పనిచేస్తున్న జీడి రవితేజను కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ మరియు ఆర్టిఐ డిపార్ట్ మెంట్ కు లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ గా లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ నియమించిన సందర్భంగా హుజురాబాద్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు , అడ్వకేట్లు, వివిధ ప్రజా సంఘాల నాయకులు సన్మానించి రవితేజకు అభినందనలు తెలియజేసి పేద ప్రజలకు దళితులకు సరైన న్యాయం అందించుటకు తమ వంతుగా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రుద్రారపు రామచంద్రం మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, ప్రముఖ కవి నాగుల సత్యం గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తడికమళ్ళ శేఖర్, ఎంఆర్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవుని రవీందర్ మాదిగ, రిటైర్డ్ ఉద్యోగి కలవల మల్లయ్య, రొంటాల బుచ్చయ్య, అడ్వకేట్లు రఫీ, కలకోటి శ్రావణ్, ఎమ్మార్పీఎస్ హుజురాబాద్ మండల అధ్యక్షుడు రొంటాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటలో అట్టహాసంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ప్రథమ మహాసభ

▶ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్,ఎస్పీ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులులి

▶జిల్లా అధ్యక్షులుగా కోయిలకొండ నారాయణరెడ్డి ఎన్నిక

▶అన్నారు.వృత్తి భద్రత,మీడియా గౌరవం,వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న యూనియన్ టి యు డబ్ల్యూ జే - రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ

▶సత్యాన్ని బయటికి తీసి ఇబ్బందులకు గురి అవుతున్న జర్నలిస్టులకు అండగా ఉంటా - డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి

▶ప్రజల కోసం పనిచేస్తున్న వారిలో 24x7 పోలీసులు,జర్నలిస్టులే - 9వ వార్డు కౌన్సిలర్ యు మహేష్



**కబురు న్యూస్, నారాయణపేట జిల్లా అక్టోబర్ 27,**

నారాయణపేట జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐ జే యూ)జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం అట్టహాసంగా జరిగింది.జిల్లా కేంద్రంలోని శాసన్ పల్లి మార్గంలో గల శ్రీ లక్ష్మి బాంకెట్ హాల్ లో టీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ కోయిలకొండ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్,ఎస్పీ యోగేష్ గౌతమ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ హాజరయ్యారు.ఈ సందర్భంగా మహాసభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ సీతా పట్నాయక్ మాట్లాడుతూ...ప్రజా సమస్యల సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజంలో ఎంతో బాధ్యత కలిగిన వృత్తి జర్నలిజమని,జర్నలిస్టులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని వృత్తిపరంగా ముందుకు సాగాలని ఆమె సూచించారు.సీనియర్ జర్నలిస్టులు నేటితరం జర్నలిస్ట్ లకు సలహాలు సూచనలు ఇచ్చి వారి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించాలన్నారు. నారాయణపేట జిల్లాలో జనరలిస్టులు అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతున్నారని ఆమె కితాబు నిచ్చారు.గత ఎమ్మెల్యే,ఎంపీ ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో జర్నలిస్టుల సహకారం ఎంతో ఉందని ఆ సమయంలో ఇక్కడ కలెక్టర్ గా పనిచేసిన కోయ శ్రీ హర్ష,జిల్లా అధికారులు ప్రస్తావించిన సందర్భాన్ని కలెక్టర్ గుర్తు చేశారు.వెనుకబడిన నారాయణపేట జిల్లా ను అభివృద్ధి పథంలో నిలిపేందుకు జర్నలిస్టుల సహకారం ఎంతో అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నారాయణపేటలో టీయూడబ్ల్యూజే ప్రథమ మహాసభ నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని ఆమె పేర్కొన్నారు.మహాసభకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చిన జర్నలిస్టులకు కలెక్టర్ హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ..సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా మీడియాకు ప్రాధాన్యత ఉందని,ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘటన మీడియా ద్వారా నిమిషాల వ్యవధిలో సమాచారం తెలుస్తుందన్నారు.జిల్లా పోలీసు శాఖకు మీడియా కోఆర్డినేషన్ అవసరమన్నారు.జిల్లా అభివృద్ధి సాధనలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించాలని ఆయన కోరారు.జర్నలిస్టులకు ఎలాంటి అవసరం ఉన్న జిల్లా ఎస్పీ కార్యాలయం తలుపులు తెరిచే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.కొన్ని సందర్భాలలో తనను నేరుగా సంప్రదించక పోయినా పి ఆర్ వో జర్నలిస్టులకు అందుబాటులో ఉంటారని ఎస్పీ తెలిపారు.ప్రథమ మహాసభలకు వచ్చిన జర్నలిస్టులందరికీ ఈ సందర్భంగా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాన్ని ధైర్యంగా వర్క్ ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేను మా పార్టీ ప్రభుత్వం అండగా సత్యాన్ని రాసిన తర్వాత జర్నలిస్టులకు ఇబ్బందులు ఉంటాయని,జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేను అండగా ఉంటానన్నారు.హెల్త్,ఇండ్ల స్థలాల విషయం కొరకు సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి త్వరలోనే పరిష్కారం అయ్యేటట్టు చూస్తానన్నారు. మన జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం లోని 4 మండలాలు ఉన్నాయని తప్పకుండా సీఎం జర్నలిస్టులకు అందరికీ న్యాయం చేస్తారని వారి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు.9 వ వార్డు కౌన్సిలర్ యు మహేష్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు,ప్రజా సమస్యల పైన 24X7 పనిచేస్తున్నది పోలీసుల, జర్నలిస్టులే అని తెలిపారు. జర్నలిస్టులు సమాజ,దేశ అభివృద్ధిలో ఎంతో కీలకమని తెలిపారు.జర్నలిస్టులో నారాయణపేట వారసత్వాన్ని వెనక వేసుకొచ్చిన కలాం సైనికులకు అభినందనలు తెలుపుతూ టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని జిల్లాలు తిరిగిన తనకు నారాయణపేటకు వచ్చే సందర్భం ఎప్పుడూ రాలేదని,కానీ నారాయణపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత కచ్చితంగా ఇక్కడ టీయూడబ్ల్యూజే తొలి మహాసభకు హాజరు కావాలనే ఆత్రుత ఉండేదని,ఈరోజు అది తీరిందని ఆయన పేర్కొన్నారు.రెండున్నర నియోజకవర్గాల కలయిక అయిన నారాయణపేట జిల్లా లో నిర్వహించిన యూనియన్ తొలి సభకు ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావడంతో యూనియన్ సత్తా ఏమిటో తెలిసిందన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో టీయూడబ్ల్యూజే ఐజేయు బలం ఎంత ఉందో అందరికీ తెలిసిందే అన్నారు.దేశంలోనే టీయూడబ్ల్యూజే అగ్రగామిగా నిలబడిందని,దేశంలోని 29 రాష్ట్రాలలో మన యూనియన్ ఉన్నా..తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీ జర్నలిస్టులు ఉన్నారన్నారు.రాష్ట్ర విభజన తర్వాత కూడా రాష్ట్రంలో మన యూనియన్ దే మెజారిటీ అని ఆయన తెలిపారు.65 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన టీయూడబ్ల్యూజే ముందు ఎన్నో చిన్నచితక యూనియన్లు తమ దుకాణాలు తెరిచాయని,కానీ మన యూనియన్ ముందు నిలదొక్కుకోలేకపోయాయని చెప్పారు.ప్రభుత్వాలకు రాజకీయాలకు అనుబంధంగా ఉండే ఏ సంఘాలు మనుగల సాధించలేవని ఆయన స్పష్టం చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 16 మంది ముఖ్యమంత్రులను చూసిన సంఘం మనదని,ఒక ప్రొఫెషనల్ సంఘంగా నిలబడి,వేలాది మంది జర్నలిస్టుల మన్ననలు పొందిందని ఆయన పేర్కొన్నారు.ఓవైపు జర్నలిస్టుల హక్కుల కోసం కొట్లాడుతూనే..మీడియా గౌరవం కాపాడేందుకు యూనియన్ ముందుకు సాగుతుందన్నారు. జర్నలిస్టులకు నైతిక విలువలు నేర్పించి,గ్రామీణ విలేకరులకి అండగా నిలిచిన సంఘం ఒక్క టీయూడబ్ల్యూజే (ఐ జేయు) అన్నారు.ఒక దశలో గ్రామీణ విలేకరులు కూడా జర్నలిస్టులే అని యాజమాన్యంతో పోరాడి 1996లో అప్పటి సీఎం చంద్రబాబును కోరి గ్రామీణ విలేకరులకు అక్రిడేషన్లు ఇప్పించిన ఘనత టీయూడబ్ల్యూజే (ఐజేయు)దే అన్నారాయన.యాజమాన్యాలు నిర్దాక్షిణ్యంగా ఓ విలేకరిని తొలగిస్తే యూనియన్ తరపున లేబర్ కోర్టులో కేసు వేసి ఆ విలేఖరికి యాజమాన్యంతో 20 లక్షలు నష్టపరిహారం ఇప్పించిన యూనియన్ మనదే అన్నారు.వృత్తి భద్రత,మీడియా గౌరవం,వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే దేయంగా యూనియన్ ముందుకు సాగుతుందన్నారు.ఎన్నో పోరాటాలు,త్యాగాలు చేసినందుకే నేడు ఈ సంఘం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఆయన పునరుద్ఘాటించారు.ఐజేయు సమావేశాలు ఢిల్లీలో జరిగినప్పుడు మన రాష్ట్రంలో యూనియన్ తరపున చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తే అక్కడి వాళ్లంతా ఆశ్చర్యానికి గురైన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు.అర్హులైన వారికే అక్రిడేషన్లు రావాలని కోరుకుంటున్నామని,మొదటినుంచి చైతన్యం కలిగిన జర్నలిస్టులు ఉన్న యూనియన్ ఇది అన్నారు.ఒకప్పుడు గ్రామానికి జర్నలిస్టులు వస్తే ఎంతో గౌరవం ఉండేదని,ఇప్పుడు మనల్ని చూస్తే దూరం వెళ్లే పరిస్థితులు ఉన్నాయని, మీడియాకు పూర్వవైభవ%శీ% తీసుకువచ్చేలా మనం వృత్తిపరంగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య,ఇంటి స్థలాలు,ఆరోగ్య భద్రత డిమాండ్లు మన ముందు ఉన్నాయని,ఈ ప్రభుత్వంలో మన డిమాండ్లు పరిష్కారం అవుతాయన్న ఆశాభావం వ్యక్తపరిచారు.మన డిమాండ్ల పరిష్కారానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. హైదరాబాదులో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో గత ప్రభుత్వం కాలయాపన చేసిందని,కానీ ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టు పక్షపాతి అయిన శ్రీనివాస్ రెడ్డిని ప్రెస్ అకాడమీ చైర్మన్ గా నియమించడం రాష్ట్రంలో జర్నలిస్టులు అందరికీ శుభ పరిణామమే అన్నారు.ఈ యూనియన్ ఉర్దూ,తెలుగు ఇంగ్లీష్ పత్రికల తో పాటు చిన్న మధ్యతర హ పత్రికల జర్నలిస్టులకూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా విరహత్ అలీ భరోసా ఇచ్చారు.ఇదే ఉత్సాహంతో నారాయణపేట జిల్లా కొత్త కమిటీ జర్నలిస్టుల సంక్షేమ%శీ% కోసం పాటుపడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్,ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు వెంకట్,జెమిని శేఖర్,ఐజేయు నాయకులు రామాంజనేయులు,కన్నయ్య,భీమ్సేన్ రావు, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి,బిజెపి జిల్లా అధ్యక్షులు పడాకుల శ్రీనివాసు,9వ వార్డు కౌన్సిలర్ మహేష్,వామపక్ష నాయకులు బి రాము,కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం మహాదానం



**కబురు న్యూస్,హుజూర్ నగర్ అక్టోబర్ 28**

ప్రైవేట్ హాస్పటల్ నందు అత్యవసరంగా మహిళకు బి పాజిటివ్ బ్లడ్ అవసరం కాగా డిఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ ను శరవాణి లో సంప్రదించగా,దగ్గుపాటి బాబురావు వెంటనే స్పందించి గ్రూపు సభ్యుడు అయినటువంటి పత్తిపాటి రవితేజను హాస్పిటల్ దగ్గరికి పంపించి రక్తదానం చేయించడం జరిగింది. పేషెంట్ తాలూకు బంధువులు డి ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు, డోనర్ రవితేజకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దగ్గుపాటి బాబురావు మాట్లాడుతూ రక్తం అనేది ధనంతో కొనలేము.సమయానికి దొరక్కపోతే అత్యవసర సమయంలో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. కానీ నియోజకవర్గం లో ఎవరికి రక్తం అవసరం అయినా తమ ట్రస్టు సభ్యులను పంపించి రక్తదానం చేపించడం జరుగుతుందని తెలిపారు. రక్తదానంతో పాటు అలాగే తమ ట్రస్ట్ తరపున అనేక సమాజ సేవా కార్యక్రమాలు అంటే పేదవారికి తమ వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని, గతంలో కూడా తమ ట్రస్ట్ తరపున ఎన్నో సహాయ సేవ కార్యక్రమాలు చేశామని,భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగుతాయని తెలిపారు.. ఉన్నంతలో ప్రజలకు సహాయపడడమే లక్ష్యంగా తమ ట్రస్ట్ గత కొన్ని సంవత్సరాల నుంచి సమాజానికి సేవలు అందిస్తూ వస్తుందని దగ్గుపాటి బాబురావు తెలిపారు. గొబ్బి రాము పాల్గొనడం జరిగింది

## (ADMS)ఎడిఎంఎస్ బైక్ షోరూంని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి




**కబురు న్యూస్,పరిగి అక్టోబర్ 28**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో ఏడిఎంఎస్ (ADMS)ఎలక్ట్రానిక్ బైక్ షోరూంని ప్రారంభించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి,దోమ జెడ్పిటిసి నాగి రెడ్డి , పరిగి మాజీ ఏఎంసి చైర్మన్ సురేందర్ కుమార్ , పరిగి పట్టణ అద్యక్షులు ఆంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, అన్వర్ సెట్,గడిసింగపూర్ మాజీ

# ఘనంగా, వైభవంగా మహా శివుడి రుద్రాభిషేకం

**కబురు న్యూస్,హుజూర్ నగర్ అక్టోబర్ 28**

**- భారీగా హాజరైన శివ భక్తులు, ప్రజలు**




హుజూర్నగర్న్ అక్టోబర్ 27 ప్రభాతవార్త హుజూర్నగర్ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన మహా రుద్రాభిషేకం ఘనంగా జరిగింది, ఉదయం 6గం.లకు మేళ తాకాల, సన్నాయి వాయిద్యాలు, గుత్తికోయల గుస్సాడి నృత్య ప్రదర్శనలు, గంగిరెద్దు బసవన్నల ఆటలతో ఆశేష శివభక్తులు కోదాడ రోడు లోని ఆంజనేయస్వామి దేవా లయం నుండి రుద్రాక్షలతోఅలంకరించిన శివలింగాన్ని ఊరేగించారు. ఊరేగింపులో భాగంగా ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛమైన శుద్ధనీరు పూజా కార్యక్రమాల కోసం సేకరిస్తూ ఊరేగింపు గాంధీపార్ సెంటర్ వరకు మహా రుద్రాభిషేకం నిర్వహణ కమిటి సభ్యులు, శివ భక్తులు నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం నిర్వహించే ఎన్ఎస్పీ క్యాంపు ఆవరణలో భక్తులు తెచ్చిన, ఇచ్చిన శుద్ధ జలం డ్రమ్ములలో పోసి ఈ పూజా కార్య క్రమాల కోసం ప్రత్యేకంగా వచ్చిన 45 మంది నాగ సాధువు లు మట్టితో (మృతిక) 8 అడుగుల పెద్ద శివలింగాన్ని ప్రత్యేకంగా స్వయంగా తయారు చేసి జల, ఫల, పుష్ప, విభూది, గంధసింధూరం, నవగ్రహ దినుసులతో పా టు మారేడు ఆకుల ద్వారా అశేష జన వాహిని మధ్య హర హర మహాదేవ శంభో శంకర అంటూ వైభవంగా కన్నుల పండువగా మహా రుద్రాభిషేక పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పూజా కార్య క్రమానికి హుజూర్నగర్ నియోజకవర్గంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నులారా మహారు ద్రాభిషేకం పూజలు వీక్షించారు. గతంలో ఎన్నడు లేని విధంగా మొట్ట మొదటిసారిగా లోక కళ్యాణం కోసం హుజూర్నగర్లో మహా రు ద్రాభిషేకం పేరిట శివునికి ఆధ్యాత్మిక పూజలు నిర్వహించడం పట్ల ఈ ప్రాంత భక్తులు, ప్రజలు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మహా రుద్రాభిషేకం నిర్వ హణ కమిటి నాయకులు గజ్జి ప్రభాకర్, పొలిశెట్టి నర్సింహారావు, ఓరుగంటి నాగేశ్వరరావు, పొలిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, కన్నెగుండ్ల అశోక్, గుండాశ్రీనివాస్, ఏలూరి రాంబాబు, కీతా మల్లికార్జున్, ఎడ్ల విజయ్, సుధాకర్, మున్సిపల్ చైర్పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్రెడ్డి, కౌన్సిలర్లు, వాస వి వనితా క్లబ్ మహిళ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.ఘనంగా రుద్రాభిషేకం ఏర్పాట్లు....... మహా రుద్రాభిషేకం పూజా కార్యక్రమం కోసం ఎన్ఎస్పీ క్యాంప్

కర

ఆవరణలో భక్తుల కోసం ఎలాంటి అసౌకర్యం కలగకుండా అయ్యప్ప, శివమాల భక్తులకు, మహిళల కోసం ప్రత్యేక గ్యాలరీలు, కుర్చీలు, అలాగే అందరు వీక్షించేందుకు ఎస్ఈడి స్క్రీ న్స్, రాత్రివేళ అందరికీ కనిపించేందుకు ప్రత్యేకంగా ఎల్ డి లైట్లు, సౌండ్ సిస్టమ్ను ఏర్పాటు చేశారు. ఈ రుద్రాభిషేకానికి 10 వేల మందికి పైగా భక్తులు హాజరు కాగా, భక్తుల కోసం నిర్వహణ కమిటి సభ్యులు మహిళ సేన కార్యకర్తల ద్వారా వారికి మంచినీళ్లు, అల్పాహారం అందించి ఎలాంటి ఇబ్బందులు శ్రీక కలగకుండా చూశారు.

**పోలీసుల ప్రత్యేక బందోబస్తు........**

మహా రుద్రాభిషేకం పూజా కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుజూర్నగర్ సిఐ జి. చరమందరాజు, డివిజన్ పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చే భక్తుల వాహనాలు కిలోమీటర్ దూరంలోనే ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. జిల్లా ఎస్పీ సన్ప్రీత్ సింగ్ మహా రు ద్రాభిషేకం కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చి పోలీస్ సిబ్బంది ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

# దివ్య శక్తి లిమిటెడ్ గ్రానైట్ డస్ట్ రోడ్డుపైన ఇబ్బందిగా మారుతున్న దృశ్యం

▶అంబులెన్స్ కు దారి ఇవ్వని దివ్య శక్తి లిమిటెడ్ కాంట్రాక్ట్ ట్రాక్టర్ డ్రైవర్

▶రోడ్డుపైన వాహనదారులను కమ్మేసినపౌడర్





**కబురు న్యూస్,అక్టోబర్ 28 మెదక్ జిల్లా**

నర్సాపూర్ మండలంసంగారెడ్డి నుండి నర్సాపూర్ వెళ్లే రహదారిపై దివ్య శక్తి లిమిటెడ్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల రోడ్లపైనిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న టిప్పర్లు లారీలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ప్రాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుండా నిత్య వాహనాలకు వెళ్లడం వల్ల వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10 నిమిషాలు నుండి 15 నిమిషాలు పాటు వాహనాలు నిలిచిపోవడం జనాలకు ప్రజలకు వాహనదారులకు ఇబ్బందిగా మారాయని ప్రజలు వాపోయారు.. ప్రభుత్వ వాహనం 108 కు అంబులెన్స్ కు సైడ్ ఇవన్నీ కూడా ట్రాక్టర్ తో డస్టును తొలగిస్తున్నారు.బస్సులు వాహనాలకు సైడు దొరకని పరిస్థితి నెలకొంది. వీటితో జరుగుతున్న ఇబ్బందులు ప్రమాదాల గురించి పలువురు వాహనదారులు వాట్సాప్ గ్రూప్ లో చెక్కర్ పోస్టులు పెడుతున్నారు. దివ్య శక్తి లిమిటెడ్ యాజమాన్యంపై సంబంధిత రవాణా శాఖ ఉన్నత అధికారులు నర్సాపూర్ దివ్య శక్తి లిమిటెడ్ పై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు..



# సైబర్ నేరాల పై పోలీసుల అవగాహన



కబురు న్యూస్, జుక్కల్ ఆర్సీ అక్టోబర్ 28

జుక్కల్ నియోజకవర్గం లోని పిట్లం మండలం బండపల్లి గ్రామంలో సోమవారం రైతులకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని కోరితే స్పందిచొద్దన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ తప్పకుండా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు , సాయిలు, గుంటి రాములు, రాజు, సాయిలు సంగబోయి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వం వడ్లకు కందులకు మక్కలకు 500/బిరూపాయల బోనస్ ఇవ్వాలి : ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి

కబురు న్యూస్, శివంపేట్ అక్టోబర్ 28

నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలం గోమారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించిన ఎమ్మెల్యే సునితారెడ్డి ఈ సందర్భంగా ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సంబంధించించి దళారుల వ్యవస్థను నిర్మూలించాలన్న ఆలోచనతో కొనుగోలు కేంద్రాలను ప్రారంబించడం జరుగుతుందన్నారు అలాగే ఏ గ్రేడ్ ధాన్యానికి ?2320/రెండు వేల మూడువందల రూపాయలు బీ గ్రేడ్ ధాన్యానికి ?2300 / రూపాయాలు ఇవ్వడం జరుగుతుందన్నారు , రైతులకు



ఎలాంటిఇబ్బంది లేకుండా నానిన మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొనుగోలుసెంటర్ ల నిర్వాహకులకు తెలియజేయడం జరిగిందన్నారు ,రైతులకు సంబంధించి సంచులు గాని సూతిలి గానీ రవాణా వ్యవస్థకు సంబంధించి లారీలు గానీ..ఒకవేళ లారీల కొరత ఉన్నట్టయితే ట్రాక్టర్ ల ద్వారా ధాన్యాన్ని తీసుకుపోవాలని సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో బా రా సా సీనియర్ నాయకులు చంద్రా గౌడ్,మన్సూర్ ,కల్లూరి హరికృష్ణ,మాధవ రెడ్డి ,పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, యాధా గౌడ్ , నర్సింహా రెడ్డి,మహేందర్ రెడ్డి,బిక్షపతి రెడ్డి కుంటలక్ష్మణ్, యువ నాయకులు రాకేష్ రెడ్డి సమీర్ ,శకీల్ ,తదితరులు పాల్గొన్నారు

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



కబురు న్యూస్, వెల్దుర్తి అక్టోబర్ 28

వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఆవుల రాజిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో శేరిల్లా గ్రామానికి చెందిన ప్రవీణ్, వెల్దుర్తి కి చెందిన లింగం గౌడ్ లకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నియోజకవర్గం ఇన్చార్జ్ ఆవుల రాజు రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మహేశ్ రెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్, మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు శ్రీశైలం ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు హరీష్ వర్ధన్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, సహకార సంఘమ్ చైర్మన్ సూరజ్ రెడ్డి లు సోమవారం ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి విక్రయించుకోవాలని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మద్దతు ధర పొందాలని తెలిపారు. ఏ గ్రేడు ధాన్యానికి క్వింటాకు రూ. 2320, బి గ్రేడు ధాన్యానికి అయితే రూ. 2300 చొప్పున చెల్లించడం జరుతుందని అన్నారు. రైతులు వినియోగిచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వీడేసీ సభ్యులు పాల్గొన్నారు.

# బోరంచ ఎత్తిపోతల తో మనూరు ,రేగోడు మండలాలు సస్యశ్యామలం: దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి.







కబురు న్యూస్, సంగారెడ్డి జిల్లా. అందోల్ అక్టోబర్28.

**» రూ.430.50 లక్షలతో నిర్మించనున్న లక్షలతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం రెండు ఫీల్డ్ గ్రావిటి మెయిన్స్ కి శంకుస్థాపనలి**

**» గ్రావిటీ మెయిల్ ద్వారా మనూరు మండలంలో 2900 ఎకరాలకు సాగునీరు.**

**» రూ.259 లక్షలతో నిర్మించనున్న గ్రావిటీ మెయిన్ ద్వారా రేగోడు మండలంలో 500 ఎకరాలకు సాగు నీరు.**

**» ఆరు మాసల్లో పనులు పూర్తి చేసి చెరువులు నింపాలి.**

బోరంచ నల్ల పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే.మారుమూల నారాయణఖేడ్ నియోజకవర్గం బోరంచ లో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం ద్వారా రేగోడు మనూర్ మండలాలు సస్యశ్యామలం అవుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహన్నారు. సోమవారం బోరంచలో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం ఫీల్డ్ గ్రావిటీ మెయిన్స్ కు మంత్రి దామోదర్ రాజనర్సింహ జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోరంచలో మొదటగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎంపీ సురేష్ షట్కర్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి లు జిల్లాలోని ప్రధాన దేవాలయమైన బోరంచ నల్ల పోచమ్మ దేవాలయం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు, ఆలయ పూజారులు మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంజీరా నదిపై ఆలయ సమీపంలో నిర్మించనున్న బోరంచ ఎత్తిపోతల పథకం ఫీల్డ్ గ్రావిటీ మెన్స్ కు మంత్రి శంకుస్థాపన చేశారు . రూ. 430.50 లక్షలతో నిర్మించనున్న ఫీల్డ్ మెయిన్ గ్రావిటీ ద్వారా మనూరు మండలంలో బోరంచ, టి లింగంపల్లి, తాటిపల్లి, సింధు గ్రామాలలో చెరువులు నింపడం ద్వారా 2900 ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు. రు. 259 లక్షలతో నిర్మించనున్న ఫీల్డ్ మెయిన్ గ్రావిటీ ద్వారా రేగోడు మండలంలోని రేగోడు, చౌటుపల్లి, మరుపల్లి, కొత్వాలపల్లి గ్రామాలలో చెరువులు నిండింపడం ద్వారా సుమారు 500 ఎకరాలకు సాగునీరందరున్నట్లు తెలిపారు. అనంతరం పంపు హౌస్ ను పరిశీలించి మోటర్ స్విచ్ ఆన్ చేసారు. ఈ రెండు ఫీల్డ్ మెయిన్ గ్రావిటీల ద్వారా 3400 ఎకరాలకు సాగునీరు అంది ఈ ప్రాంతం మొత్తం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇక్కడి పొలాలకు తగినంత నీరు అందడంతో స్థానిక రైతులకు బంగారు పంటలు పండే అవకాశం కలుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పరిధి గ్రామాల ప్రజలు , రైతుల ఆర్థిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దుహదపడుతుందని ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని మంత్రి తెలిపారు. ఎత్తిపోతల పథకం నిర్మాణం ద్వారా ఈ ప్రాంత వ్యవసాయ పద్ధతులు మెరుగుపడతాయి, దీంతో రైతుల ఆదాయం కూడా పెరుగుతుంది. తద్వారా రైతులు ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని మంత్రి తెలిపారు. బోరంచ ఎత్తిపోతల పథకం ద్వారా పంటలకు తగినంత నీరు అందుతుందని స్థానిక రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు రైతులకు పంటల సాగులో ఎప్పటికప్పుడు నీటిని అందించేలా సహకరిస్తుంది. ముఖ్యంగా, వర్షాభావంతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాలకు ఇది రక్షణ కల్పించే ఒక పెద్ద మార్గం అవుతుంది. ఈ కార్యక్రమం పాల్గొన్న రైతులు ఈ పథకం ద్వారా పంటలకు నీటి లభ్యత పెరగడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోకచక్రవర్తి, డి ఎస్ పి వెంకట్ రెడ్డి, డి ఈ జలెందర్, ఏ ఈ విధ్యావతి, తహసీల్దార్ వెంకట స్వామి, ఈ ఈ విజయ కుమార్, నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి 1 లక్ష రూపాయలు ఆర్థిక సహాయం MLC చేసిన తీన్మార్ మల్లన్న

కబురు న్యూస్, అక్టోబర్ 28

**-ఎంబిబిఎస్ లో సీటు వచ్చినా కూడా చదువుకోలేని పరిస్థితి**

**-చదువుకు అడ్డం ఆర్థిక ఇబ్బందులే**

**-ఇబ్బందులు లేకుండా చదువు కొనసాగించడానికి లక్ష రూపాయల సహాయం**

**-క్యూ న్యూస్ అధినేత MLC తీన్మార్ మల్లన్న**

**-అడగగానే హెల్ప్ చేసిన తీన్మార్ మల్లన్నకు ప్రత్యేక ధన్యవాదాలు**

**-డాక్టర్ బాల శ్రీనివాస్,సంతోష్**



నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండలానికి చెందిన ఇటిక్యాల మంజుల కి ముగ్గురు ఆడపిల్లలు. ఆ ముగ్గురు ఆడపిల్లల చదువుకు ఎలాంటి డోకా లేకుండా ఆ తల్లి అక్కడ ఇక్కడ పనిచేస్తూ చదివించుకుంటుంది. ఆ పిల్లల్లో రెండవ పాప మహిత కి ఎంబిబిఎస్ లో సీట్ రావడం జరిగింది. కానీ ఆర్థికంగా ఇబ్బందులు ఉండడం వల్ల చేర్పించడానికి అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో డాక్టర్ బాల శ్రీనివాస్ సంతోష్ వీళ్ళ కుటుంబ సమస్యలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకు వెళ్లడంతోనే ఇమ్మిడియట్లిగా పాప చదువుల నిమిత్తం 1 లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ప్రతి పేద బిడ్డ చదువుకోవాలి ప్రతి పేద బిడ్డకు అంతో ఇంతో ఉన్నవాళ్లు సహాయం అందించాలి ఈడబ్ల్యూఎస్ ద్వారా ఇంకా చాలా ఇబ్బందులకు కొనసాగుతున్నారు విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ బీసీ పిల్లలు ఇబ్బందులు పడుతూ చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది మంచిర్యాంకు వచ్చినా కూడా మంచి సీట్లు రాక మంచి సీట్లు వచ్చినా కూడా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదింటి బిడ్డలను ఆదుకోవాల్సిందిగా నా మనవి.

# వడ్ల కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ భూమికేటాయించాలి




కబురు న్యూస్, గంభీరావుపేట అక్టోబర్ 28

గంభీరావుపేట మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని సోమవారం రోజున రైతులు తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. రైతులు మాట్లాడుతూ రైతులు పండించిన వడ్ల కొనుగోలు కేంద్రానికి స్థలం లేకపోవడంతో గ్రామ రైతులు పంట పండించిన రైతులు వడ్ల కుప్పలను రోడ్డుపై పోయడంతో గతంలో అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి ఉందిఅని తెలిపారు. అదేవిధంగా పోలీస్ శాఖ కూడా వడ్ల కుప్పలను రోడ్ల వెంబడి పోసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు అని, శాశ్వత పరిష్కారం కోసం రైతులంతా గంభీరావుపేట గ్రామంలోని సర్వే నెంబర్ 104 కాకుల గుట్టలో రైతులకు సరిపోయేంత భూమి ఉన్నందున ఒక 10 ఎకరాల భూమి రైతుల కొనుగోళ్ల కోసం కేటాయించవలసిందిగా రైతులంతా చెప్పడంతో వెంటనే స్పందించిన తహసిల్దార్ ఆర్ ఐ దేవరాజ్ ను వెంటనేఅట్టి స్థలాన్ని పరిశీలించాలని కోరారు. ఆర్ఐ అట్టి కాకుల గుట్ట భూమిని రైతులు తీసుకువెళ్లి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మల్యాల రాజ్ వీర్ మాజీ వార్డు సభ్యులు లక్కిరెడ్డి రాజిరెడ్డి, బోయన్న గారి రాజు, ఎగదండి మహేష్, లింగారెడ్డి గారి సురేందర్ రెడ్డి, లింగారెడ్డి గారి ఎల్లారెడ్డి, నెఊరి కృష్ణారెడ్డి, లక్ష్మణ్, లక్కిరెడ్డి సత్యం రెడ్డి తో పాటు పలువురు రైతులుపాల్గొన్నారు.

# టిడిపి ఆత్మకూరు మండల అధ్యక్షుడు గోనె మధుకర్ జన్మదిన వేడుకలు

కబురు న్యూస్, 29


ఘనంగా టిడిపి ఆత్మకూరు మండల అధ్యక్షుడు గోనె మధుకర్ జన్మదిన వేడుకలు వేడుకలకు హాజరైన పర్కాల టీడీపీ నియోజకవర్గ బాద్యులు కందుకూరి నరేష్, శాలువా తో సత్కరించి కేక్ కటింగ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కార్యదర్శి హరిదాస్యం సురేష్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కోక్కరకొండ కుమారస్వామి,గీసుగొండ మండల అధ్యక్షులు, తాటి సాంబశివరావు, ఆత్మకూరు మండలం సీనియర్ నాయకులు మరిగిద్దె రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీపై స్పందించిన పవన్



కబురు సినిమా అక్టోబర్ 28..
కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీపై నటుడు, జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రియాక్టయ్యారు. ఆయనతో పాటు విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ కూడా తనదైన స్టైల్‌లో రెస్పాండ్ అయ్యారు. బీజేపీ, డీఎంకే సిద్ధాంతాలకు వ్యతిరేఖంగా ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేతకు పవన్, ప్రకాష్ ఎం చెప్పారంటే.. "నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పాలిటిక్స్ విషయంలో భయపడడం లేదు" అంటూ విజయ్ ఆదివారం తన పార్టీ తొలి మహానాడులో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే దేశ నలుమూలల నుండి సినీ, రాజకీయ ప్రముఖులు విజయ్‌కి అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా అభినందనలు తెలిపారు. పవన్ తన పోస్ట్‌లో " సిద్దులు, సాధువులకు నిలయమైన తమిళనాడులో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన విజయ్ కి నా హృదయపూర్వక అభినందనలు" అంటూ పోస్ట్ చేశారు.

# రక్షణశాఖ అనుమతులతోనే 'అమరన్' చేశాం



కబురు సినిమా అక్టోబర్ 28..
శివ కార్తికేయన్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కించిన చిత్రం 'అమరన్' అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది మూవీ యూనిట్. తాజాగా దర్శకుడు రాజ్‌కుమార్ ఈ సినిమా షూటింగ్ విశేషాలను పంచుకున్నారు. కశ్మీర్‌లో చిత్రీకరణ చేయడం కష్టంగా అనిపించిందన్నారు. "అమరన్' యాక్షన్ సినిమా అనుకుంటున్నారు. కానీ, ఇది ఓ సైనికుడి జీవిచరిత్ర. ఆయన కుటుంబంతో గడిపిన రోజులతో పాటు సైన్యంలో ఆయన ప్రయాణాన్ని చూపించాం. ఇందులో రాజకీయ భావజాలం ఉపయోగించలేదు. ఏ నటుడినీ దృష్టిలోపెట్టుకొని ఈ కథ రాయలేదు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత ముకుంద్ కుటుంబాన్ని కలిశాను. వాళ్లు తమిళ హీరో అయితే బాగుంటుందన్నారు. దీంతో శివకార్తికేయన్‌ను ఎంపిక చేశాం. ఈ సినిమా కోసం ఆయన చాలా కష్టపడ్డారు. హీరోయిన్ పాత్ర కోసం నిబద్ధత కలిగిన నటి కావాలనుకున్నాం. సాయిపల్లవి నాకు చాలారోజుల నుంచి తెలుసు. ఆమె అయితేనే ఈ పాత్రకు న్యాయం చేయగలదని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా భాగం కశ్మీర్‌లో జరిగింది. అక్కడ ఎప్పుడూ టెన్షన్ వాతావరణమే ఉంటుంది. కానీ అక్కడే చిత్రీకరణ చేయాలని భావించాను. రక్షణశాఖ అనుమతులు తీసుకొని షూటింగ్ పూర్తిచేశాం. స్క్రిప్ట్ అధికారులకు చూపించి వాళ్లు ఓకే అని చెప్పిన తర్వాతే చిత్రీకరణ ప్రారంభించాం. భద్రత విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం" అని చెప్పారు.'అమరన్'లో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఆయన ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.."తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ చాలా ప్రత్యేకం. ఈసారి నేను, మా బృందం ప్రత్యేకమైన చిత్రంతో వస్తున్నాం. ఇదొక నిజమైన హీరో కథ. ఎంతో నిజాయతీగా తెరపైకి తీసుకొచ్చారు దర్శకుడు. సాయిపల్లవికి తగిన ఇందు పాత్ర ఈ సినిమాతో దొరికింది. జీవీ సంగీతం ఎంతో బలం" అన్నారు.

# దుల్కర్ అభిమానులు కాలరెగరేసుకునే చిత్రమిది




కబురు సినిమా అక్టోబర్ 28..
'లక్కీ భాస్కర్'తో దీపావళి బరిలో వినోదాలు పంచనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమా ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు త్రివిక్రమ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ.. "సినిమా చూశా. చాలా బాగుంది. ఈ చిత్రం చూస్తున్నంత సేపూ భాస్కర్ లక్కీ అవ్వాలని కోరుకుంటాం. చివరికి తను అలాగే బయటకొస్తాడు. ఇందులో చిన్న చిన్న పాత్రల్ని కూడా వెంకీ అద్భుతంగా చూపించారు. ఆయా పాత్రలన్నీ మనలో ఒక భావోద్వేగాన్ని కలిగిస్తాయి. భారతీయ చిత్ర పరిశ్రమకు మలయాళ సినిమా ఓ కొత్త కోణాన్ని సృష్టించింది. అలాంటి చిత్రసీమలో నుంచి వచ్చిన కొత్త వేవ్‌లోని ఒకానొక మైలురాయి దుల్కర్ సల్మాన్. దీంట్లో తను అద్భుతంగా నటించాడు. ఒక బ్యాంకులోకి వెళ్లి.. క్లర్క్ జీవితంలోకి వెళ్లినంత తేలికగా మనల్ని కూడా చేయి పట్టుకుని ఆ ప్రపంచంలోకి తీసుకెళ్లిపోతాడు. ఈ సినిమా చూసి రాంకీకి అభిమానినైపోయా" అన్నారు. "ఈ మధ్య కాలంలో నేను చూసిన బెస్ట్ ట్రైలర్ 'లక్కీ భాస్కర్'. ఈ సినిమా కచ్చితంగా పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్ముతున్నా. దుల్కర్‌కు నేను పెద్ద అభిమానిని. ఇండస్ట్రీలోకి రాకముందు తన సినిమాల్ని డౌన్‌లోడ్ చేసుకుని చూస్తుండేవాణ్ని. సినిమాల్లోకి వచ్చాక తనతో కలిసి చెన్నైలో ఓ మల్టీస్టారర్ కథ విన్నా. ఆ తర్వాత మేమిద్దరం 'మహానటి', 'కల్కి 2898ఎ.డి' చిత్రాల్లో భాగమయ్యాం" అన్నారు హీరో విజయ్ దేవరకొండ. హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. "ఇదొక కొత్త జానర్ సినిమా. దీన్ని చూస్తున్నప్పుడు నిజ జీవిత సంఘటనలతో రాసుకున్న ఒక మధ్యతరగతి వ్యక్తి కథలా అనిపిస్తుంది. వెంకీ రాసుకున్న కథ.. ఇందులోని ప్రతి సీన్ చాలా పరిణతితో ఉంటుంది. ఈ చిత్రానికి మూడు భాషల్లో సొంతంగా డబ్బింగ్ చెప్పుకున్నా. దీంట్లో మీనాక్షి చేసిన సుమతి పాత్ర అందర్నీ ఆకట్టుకుంటుంది. అలాగే ఇందులో రాంకీ పోషించిన పాత్ర ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోతుంది" అన్నారు. "ఇప్పటి వరకు బ్యాంకింగ్ వ్యవస్థ మీద ఇలాంటి చిత్రమేదీ రాలేదు. డబ్బంటే ఇష్టమున్న ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది. దుల్కర్ అభిమానులు కాలరెగరేసుకునేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. ఈ కార్యక్రమంలో మీనాక్షి చౌదరి, రాంకీ, ఆది, మానస, అనన్య, భార్గవి, రాజ్‌కుమార్ కసిరెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ సర్జరీ రూమర్స్‌పై స్పందించిన నయనతార..

కబురు సినిమా అక్టోబర్ 28..
తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు గతంలో వచ్చిన వార్తలను నటి నయనతార ఖండించారు. తన ముఖాన్ని మార్చుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదని తెలిపారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో సినిమాలతో అలరిస్తోన్న నయనతార తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశంపై మాట్లాడారు.

"నా కనుబొమలు అంటే నాకు చాలా ఇష్టం. వాటి ఆకారం ఎప్పుడూ మారుస్తూ ఉంటాను. ప్రతి రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు వాటిని మార్చుతుంటాను. వాటి కోసం ఎంతో సమయాన్ని వెచ్చిస్తాను. కనుబొమల ఆకారం మారినప్పుడల్లా ముఖంలో మార్పు కనిపిస్తుంది. బహుశా అందుకే నా ముఖంలో మార్పులు వచ్చాయని ప్రజలు అనుకొని ఉంటారు. వాళ్లు అనుకున్నది నిజం కాదు.. అలాగే డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావచ్చు. ఒక్కోసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తుంటాయి. మరోసారి అవి లోపలికి వెళ్లినట్లు అనిపిస్తుంటుంది. కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు.. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార సరదాగా చెప్పారు.2003లో మలయాళం చిత్రంతో నయనతార ఇండస్ట్రీలోకి వచ్చారు. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో ఆమె ముఖం తొలి సినిమాలో కంటే సన్నగా కనిపించింది. దీంతో ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారనే రూమర్స్ మొదలయ్యాయి. తాజాగా నయనతార వాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ప్రస్తుతం ఆమె తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్నారు. గతేడాది 3 సినిమాలతో అలరించిన ఆమె.. ప్రస్తుతం ఐదు సినిమాలతో బిజీగా ఉన్నారు.

# నేనూ తిరిగి పోరాడగలను!



కబురు సినిమా అక్టోబర్ 28..
కన్నీళ్లతో పోరాడేంత ధైర్యం తనలో ఉందని అంటోంది అగ్రతార సమంత. మరి ఆమె పోరాటం ఎవరి కోసమో తెలుసుకోవాలంటే 'సిటాడెల్:హనీ బన్నీ' చూడాల్సిందే. ఆమె, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్‌సిరీస్ ఇది. స్పై యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సిరీస్‌కు రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. విడుదల సమయం దగ్గర పడుతున్న వేళ ప్రచార కార్యక్రమాల్ని పరుగులు పెట్టిస్తోంది సిరీస్ బృందం. తాజాగా ఇందులోని తన పాత్రను పరిచయం చేస్తూ "ఏజెంట్ హనీని కలవండి" అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది సమంత. "నేనూ తిరిగి పోరాడగలను.. బతకగలను', 'నా కూతుర్ని వీటన్నింటికీ దూరంగా ఉంచడం నా బాధ్యత" లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ వీడియోలో సమంత తన యాక్షన్ సన్నివేశాలతో అదరగొడుతుంది. కేకే మేనన్, సిమ్రాన్ తదితరులు నటించిన ఈ సిరీస్ వచ్చే నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com